ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

శనివారం | 19 సెప్టెంబరు, 2026 | పేజీలు : 08

## హ్యామ్ రోడ్ల ఒప్పందాలు పూర్తి చేసి పనులు ప్రారంభించాలి

### అసెంబ్లీ జీరో అవర్‌లో ప్రభుత్వాన్ని కోరిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజాపక్షం/హనుమకొండ :** రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల రహదారుల రూపురేఖలు మార్చేందుకు ఉద్దేశించిన హ్యామ్ (హైబ్రిడ్ యాన్యుటీ మోడల్) రోడ్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శాసనసభ సమావేశాలలో భాగంగా నిర్వహించిన జీరో అవర్‌లో హ్యామ్ రోడ్ల అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ శాఖల పరిధిలోని వేల కిలోమీటర్ల రోడ్ల అభివృద్ధికి హ్యామ్ పథకాన్ని తీసుకువచ్చిన ప్రభుత్వం ఇప్పటికే టెండర్లు పిలిచి, అన్ని రకాల ముందస్తు అనుమతులు మంజూరు చేసిందని అయితే, కాంట్రాక్టర్లతో ప్రభుత్వం ఇంకా అధికారిక అగ్రిమెంట్లు చేసుకోకపోవడం వల్ల క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభం కాలేదని సభ దృష్టికి తెచ్చారు. అక్టోబర్ నుంచి రోడ్డు నిర్మాణాలకు అత్యంత అనుకూలమైన వర్కింగ్ సీజన్ ప్రారంభమవుతున్నందున,

వివరాలు 2లో

# వెలికట్ట 271 సర్వేనెంబర్ భూమిని పరిశీలించిన సిఎల్‌పి బృందం

### తప్పుడు పత్రాలతో 6.18 ఎకరాల భూమిని మార్చుకున్నారు



**ప్రజాపక్షం/కొండపాక:** ఇటీవల అసెంబ్లీలో చర్చకు వచ్చిన కొండపాక మండలం వెలికట్ట శివారులోని 271 సర్వే నెంబరు ప్రభుత్వ భూమి విషయంలో సిఎల్‌పి బృందం అట్టి భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తప్పుడు పత్రాలతో హరీశ్‌రావు మామ పేరుపై 6.18 ఎకరాలు మార్చుకున్నారని ఎంపీ ఎమ్మెల్సీల బృంద సభ్యులు ఆరోపించారు. ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి లు మాట్లాడుతూ, 271 సర్వేనెంబర్ అసైన్డ్ భూమిని రిటైర్డ్ సైనిక ఉద్యోగులైన సత్యనారాయణకు కేటాయించారని అప్పుడు ఈ సర్వే నంబర్ లో గల 327 ఎకరాల్లో హద్దులు లేకుండానే వారికి కేటాయించారన్నారు. కేటాయించిన భూమిని ఎవరికి కూడా విక్రయించకూడదని నిబంధనలు ఉన్నాయన్నారు. కానీ 2009 లో ఆర్డీవో ద్వారా తీసుకున్న ఎన్‌ఓసి ఆధారంగా ప్రధాన రహదారికి అనుకుని ఉన్న భూమి హద్దులను సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ఎన్‌ఓసి రిఫరెన్స్ నెంబర్ ఏ కార్యాలయంలో కూడా లేదన్నారు. ఎన్‌ఓసి అనేది జిల్లా కలెక్టర్ స్థాయి ఇవ్వాల్సి ఉంటుందని దీన్ని బట్టి చూస్తే పలుకుబడి ఉపయోగించి తప్పుడు ఎన్‌ఓసి తో రిజిస్ట్రేషన్ చేపించుకున్నారన్నారు. వీటిని సమగ్రంగా పరిశీలించి స్వాధీనం చేసుకోవాలని తహసిల్దార్ మల్లికార్జున్ రెడ్డికి సూచించారు. బృంద సభ్యులు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అద్దంకి దయాకర్ అనిల్ కుమార్ యాదవ్, సురేష్ షెట్కార్, ఎంపీ కావ్య మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు అంక్షారెడ్డి పలువురు నాయకులు ఉన్నారు.

**భారీగా పోలీసు బలగాలు:** సీఎల్పీ బృందం క్షేత్రస్థాయి పర్యటన వస్తున్న సందర్భంగా కొండపల్లి మండలం వెలికట్ట శివారులో భారీగా పోలీసులు చేరుకున్నారు. గొడవలు జరిగే అవకాశం ఉంటుందని ముందు జాగ్రత్తగా పోలీసులు భారీగా చర్యలు చేపట్టారు.

### పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన

# సామర్థ్యాలపై ప్రత్యేక దృష్టి



### కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**ప్రజాపక్షం/నడికూడ:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగ్గా ఉండే విధంగా ఉపాధ్యాయులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా నడికూడ మండలంలోని రామకృష్ణాపూర్ , కంఠాత్మకూర్ గ్రామాల్లో జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు.గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితులు, తాగునీటి సరఫరాను స్వయంగా పరిశీలించారు. రామకృష్ణాపూర్ లోని పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న విఓ భవన పురోగతి ని కుడా చూశారు.అదేవిధంగా ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓటర్ల వివరాల పరిశీలన, అభ్యంతరాల స్వీకరణ తదితర అంశాల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.అనంతరం కంఠాత్మకూర్ లోని మండల ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. కేంద్రంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల అభ్యసన సామర్థ్యం, విద్యా ప్రగతిని పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న ప్రత్యేక బోధన, కేంద్రంలో ఉన్న మౌలిక సదుపాయాలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.మెనూ ప్రకారం వంటలు చేసారా లేదా అని వంటశాల కి వెళ్లి పరిశీలించారు.గుడ్లు, ఇతర వంట సామాగ్రి సరిపడా నిల్వలు ఉన్నాయా లెవా అని అడిగారు.మహ్మద్ షరీఫ్ కుంటను కలెక్టర్ పరిశీలించి.. కుంట పరిరక్షణకు వీబీజీ రాంజీ పథకం కింద అభివృద్ధి పనులను చేపట్టాలన్నారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో 6వ, 8వ, 10వ తరగతి గదులను జిల్లా కలెక్టర్ సందర్శించి విద్యార్థులతో నేరుగా మాట్లాడారు.ఈ సందర్భంగా రామకృష్ణాపూర్ సర్పంచ్ పెండ్లి లక్ష్మి , కంఠాత్మకూర్ సర్పంచ్ కొంగంటి తిరుపతి, తహసీల్దార్ రాణి, ఎంపీడీఓ రామకృష్ణ, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, ఇరిగేషన్, ఈజీఎస్, విద్య, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ప్రజాసమస్యలను మళ్లించేందుకు

# కాంగ్రెస్ డైవర్షన్ పాలిటిక్స్

### మాజీ మంత్రి హరీష్‌రావు

**ప్రజాపక్షం/సిద్దిపేట:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని, అందులో భాగమే తన వ్యవసాయ భూమి వద్దకు కాంగ్రెస్ ఎంపీల పర్యటన అని మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్ రావు మండిపడ్డారు. ఈరోజు సిద్దిపేటలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. గత మూడు నాలుగు రోజులుగా కాంగ్రెస్ పార్టీ వ్యవహార శైలి గమనిస్తుంటే ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే అన్నట్లుగా ఉంది. దొంగతనం చేసిన దొంగే.. ఎదురు దొంగ దొంగ అని అరిచినట్లుగా వారు ప్రవర్తిస్తున్నారు. 22ఎ నిషేధిత జాబితాలో లక్షలాది ఎకరాలు పెట్టి, ప్రజలను నరకయాత్రకు గురిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ తీరును మేము ప్రశ్నిస్తే.. సమస్యను పరిష్కరించకుండా మాపైనే ఎదురుదాడికి దిగుతూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే స్వయంగా అసెంబ్లీ సాక్షిగా ఈ విషయాన్ని ఒప్పుకున్నారు. టైం తక్కువ ఉండటంతో మా కలెక్టర్లు ఆగమాగం, దబాదబా భూములను నిషేధిత జాబితాలో పెట్టారు అని ఆయనే చెప్పారు. ఏకంగా 30 లక్షల ఎకరాలను 22ఎ లో పెడితే ఆ రైతులు, ప్రజలు ఎంత ఇబ్బంది పడి ఉంటారు? రైతుబంధు రాక, యూరియా అందక, పిల్లల పెళ్లిళ్లు, చదువుల కోసం భూములు అమ్ముకోలేక నానా అవస్థలు పడుతున్నారు.లక్షలాది కుటుంబాల సమస్యలు పరిష్కరించమని అడిగితే.. రేవంత్ రెడ్డి రాచరిక పోకడలతో, అహంకార ధోరణితో మమ్మల్ని ప్రశ్నిస్తారా అంటూ ఎదురుదాడి చేస్తున్నారు. ఎదురుదాడి చేస్తే ప్రజా సమస్యలు తీరిపోతాయా. అని ప్రశ్నించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్నాళ్లవుతున్నా ఎందుకు విచారణ చేపట్టలేదు. పర్యటనల పేరిట ఇప్పుడే ఎందుకు హంగామా చేస్తున్నారు. 22ఎ లో ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఎప్పుడైతే బీఆర్ఎస్ పార్టీ లేవనెత్తిందో, ముఖ్యమంత్రి తమ్ముళ్ల భూ కుంభకోణాలను ఎప్పుడైతే బయటపెట్టిందో, మంత్రి పొంగులేటి ఆయన కొడుకు చేస్తున్న భూ దందాలను ఎప్పుడైతే ఎండగట్టిందో.. అప్పుడే కుళ్లు బుద్ధితో కక్షకట్టి మాపై ఎదురుదాడి చేస్తున్నారని ఆరోపించారు.



నా ఆస్తుల గురించి ప్రజలకు తెలియనిదేమీ లేదు. ప్రతి ఎన్నికల అఫిడవిట్‌లో నా ఆస్తుల వివరాలను పూర్తిగా వెల్లడించాను. అన్నీ చూశాకే ప్రజలు నాకు ఓట్లేసి గెలిపించారు. కానీ కాంగ్రెస్ నేతలు మాత్రం అక్రమాలు జరిగినట్లు అద్భుత కల్పనలు సృష్టిస్తున్నారు.అసెంబ్లీలో కూడా ఏకపక్షంగా మమ్మల్ని సస్పెండ్ చేశారు. మా ఎమ్మెల్సీ గారు స్పీకర్‌ను ఉద్దేశించి అనకపోయినా, ఒకవేళ అలా అనిపిస్తే ఆ వ్యాఖ్యలు వెనక్కి తీసుకుంటున్నామని బీఆర్ఎస్ శాసనసభా పక్ష ఉప నాయకుడిగా నేను స్పష్టంగా చెప్పాను. కెటిఆర్ గారు, కృష్ణారావు గారు సస్పెన్షన్ ఎత్తివేయాలని, మేము సభకు వస్తామని కోరినా వినలేదు. సభలో ప్రతిపక్షం ఉంటే ప్రభుత్వ బండారం బయటపడుతుందనే దురుద్దేశంతోనే సస్పెండ్ చేసి ఏకపక్షంగా సభను నడిపారు. ఈరోజు కాంగ్రెస్ ఎంపీల బృందం సిద్దిపేటకు వస్తుందని పెద్ద హంగామా చేశారు. ఎవరు వచ్చినా అతిథి మర్యాదలు చేయడం సిద్దిపేట సంస్కృతి.అందుకే స్థానిక ఎమ్మెల్యేగా వారిని స్వాగతించి, భోజనానికి ఆహ్వానించాను. కావాలంటే దగ్గరుండి నేనే నా వ్యవసాయ భూమిని చూపిస్తానని, వారి అనుమానాలు నివృత్తి చేస్తానని చెప్పాను. నా వ్యవసాయ భూమిలో విలాసవంతమైన ఫామ్ హౌస్ ఉందని ముఖ్యమంత్రి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే తహసీల్దార్, సర్వేయర్ వచ్చి సర్వే చేసి నా భూమికి హద్దులు చూపించారు. నేను రిజిస్ట్రేషన్ చేసుకున్నది 13 ఎకరాల 12 గుంటలు కాగా.. సర్వే తర్వాత నేను 13 ఎకరాల 10 గుంటల స్వాధీనంలో మాత్రమే ఉన్నానని, అంటే 2 గుంటలు తక్కువే ఉన్నానని తేలింది. నా భూమి కొనుగోలులో ఒక్క చిన్న తప్పు ఉందని నిరూపించినా మొత్తం భూమిని ప్రభుత్వానికే వదిలేస్తా అన్నారు.ఈసమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, సుడా మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డి,వేలేది రాధకిషన్‌శర్మ, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దాడికి పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలి

**ప్రజాపక్షం/వేలేరు :** గిరిజన నేత కాంగ్రెస్ పార్టీ వేలేరు మండల అధ్యక్షుడు మురావత్ లక్ష్మణ్ నాయక్‌పై దాడికి పాల్పడిన వ్యక్తులను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని సంతూసేవాలాల్ మహారాజ్ వ్యవస్థాపకుడు లీగల్ అడ్వైజర్ ఆంగోతు సాంబయ్య,అధ్యక్షుడు మురావత్ రాజు తీవ్రంగా కండించారు.శుక్రవారం వేలేరు మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గిరిజన నేతపై దాడులకు పాల్పడడం సరైందికాదని దాడికి పాల్పడిన వారిపై అధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులను చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ఆంగోతు సాంబయ్య, మురావత్ రాజు, సర్పంచ్ మురావత్ సాంబయ్య, మాజీ ఎంపిటిసి సాంబరాజు, ఉపసర్పంచ్ భాస్కర్, భూక్య కుమార్, సుమన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ

**ప్రజాపక్షం/ములుగుః** పేద విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు. మండలంలోని ఆకులవారి గణపురం, ఏటూరునాగారం రామాలయం, చినబోయినపల్లి, శంకరాజుపల్లి, ముళ్లకట్ట, ఇప్పలగూడెం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 500 మంది విద్యార్థులకు బ్యాగులు, నోట్‌బుక్స్, పలకలను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. పల్లె ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న గ్రేస్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకుడు బిషప్ మారినేని జాకబ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మురళీకృష్ణరెడ్డి, కల ప్రసాద్, ముగ్రం రాజేష్, కంతి ముత్తయ్య, లక్ష్మణ్‌రావు, ఆదిశివ, శంకరాజుపల్లి సర్పంచ్ దేవులపల్లి విజయ్‌కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి



**ప్రజాపక్షం/గూడూరు:** ప్రభుత్వ పాఠశాలల బలోపేతంతో పాటు విద్యార్థుల సంఖ్య పెంపునకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని సీతానాగారం గ్రామ సర్పంచ్ భూక్య మంగీలాల్ నాయక్ అన్నారు. శుక్రవారం గూడూరు మండలం సీతానాగారం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పులి దేవేందర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు షూ బెల్ట్ టైలను సర్పంచ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యావాతావరణం కల్పివచడంతో పాటు మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు.విద్యార్థులలో క్రమశిక్షణ ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు పాఠశాల స్థాయిలో చేపడుతున్న కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు.తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి విద్యాభివృద్ధికి సహకరించాలని కోరారు.ఈకార్యక్రమంలో జాటోత్ హేమ్లా జన్ను రాజమౌళి దేవి విజేందర్‌రెడ్డి వీరమ్మ తదితరులు పాల్గోన్నారు.

## అన్నదానం మహోన్నతమైన సేవా కార్యక్రమం




**ప్రజాపక్షం/హనుమకొండటౌన్:** అన్నదానం మహోన్నతమైన సేవా కార్యక్రమమని సిపిఐ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్ అన్నారు. శుక్రవారం గుండ్ల సింగారం సురవరం సుధాకర్ రెడ్డి నగర్ లో ప్రతిష్టించిన విగ్నేషుడి విగ్రహం వద్ద జరిగిన మహా అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, అతిధులుగా మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్, నాయకులు పొనుగోటి రాముగోపాల్ చారి, మామునూరి దామోదర్ లు హాజరై భక్తులకు, ప్రజలకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించి భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్ మాట్లాడుతూ అన్నదానం మహోన్నతమైన సేవా కార్యక్రమమని, ఆకలితో ఉన్న వారికి ఆహారం అందించడం ఎంతో పుణ్యకార్యమని ఈ మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన తురక శోభన్ కుటుంబం ఎప్పుడు దినదిన అభివృద్ధి చెందుతూ ఉంటుందని వారు పేర్కొన్నారు. సమాజంలో సేవాభావాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. అనంతరం అన్నదానం దాత తురక శోభన్ ను గణపతి కమిటీ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్, నాయకులు పొనుగోటి రాముగోపాల్ చారి, మామునూరి దామోదర్, గుంటీ రజిత, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు తోట రామారావ, ఐదులపురం ప్రదీఫ్, లక్కం రాజు, రాపాల తిరుపతి, కళ్లేపల్లి రాజు, పట్టేం సరోజన, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## కెసిఆర్ కుటుంబ భూ అక్రమాలపై బహిరంగ విచారణ జరిపించాలి



**ప్రజాపక్షం/హసన్ పర్తి:** కెసిఆర్ కుటుంబం చేసిన వేల కోట్ల అక్రమాలపై బహిరంగ విచారణ జరిపించాలని హసన్ పర్తి మండలకాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రేణికుంట్ల అశోక్ అన్నారు.శుక్రవారం హసన్ మండల పరిధిలోని ఎర్రగట్టుగుట్ట కళ్యాణ మండప హాలులో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రేణికుంట్ల అశోక్ కుమార్, గ్రేటర్ వరంగల్ 65వ డివిజన్ అధ్యక్షులు నేదునూరి సునీల్, 66వ డివిజన్ అధ్యక్షులు గొర్రె కిరణ్,1వ డివిజన్ అధ్యక్షులు చిర్ర రామ్ ఆధ్వర్యంలో పత్రిక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిఆర్ఎస్ గత10 సంవత్సరాల ప్రభుత్వ పాలనలో కెసిఆర్ కుటుంబసభ్యులురాష్ట్రవ్యాప్తంగా చేసిన భూ దోపిడిని ప్రజల ముందు ఉంచడం కాంగ్రెస్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. కెసిఆర్ నీళ్ళు,నిధులు, నియామకాలకోసం ప్రత్యేకంగా తెలంగాణను సాధించుకోవాలనిఅనేవారని ప్రత్యేక తెలంగాణ వచ్చిన తర్వాత తొలి తెలంగాణ ముఖ్యమంత్రిగా కేసీఆర్ భూకబ్జాలు,దోపిడీలు చేశారని విమర్శించారు.ధరణి పోర్టల్ అడ్డుపెట్టుకునిధరణి పోర్టల్ ని తమ చేతిలో ఆయుధంగా మార్చుకున్నారని, రైతుల భూములను పెండింగ్ లో పెట్టి, తమకు కావాల్సిన భూములను 24 గంటల్లో తమ బినామీల పేరు మీదకు మార్చుకున్నారని అన్నారు.హైదరాబాద్ చుట్టూ ఉన్న విలువైన ప్రభుత్వ భూములు కబ్జా, కోకాపేట్, కొల్లూర్, శంషాబాద్ లో వేల కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములను తమ కుటుంబ సంస్థలకు, తమ అనుచరులకు కట్టబెట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు ప్రస్తుత సర్పంచులు వార్డు మెంబర్లు మహిళా నాయకులు ప్రజాప్రతినిధులు ఎస్సీ బీసీ మైనారిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## మూల మలుపులో ట్రాన్స్ ఫార్మర్.. కాలనీ వాసుల ఇబ్బందులు



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ అలంకార్ జంక్షన్ సమీపంలో కాకతీయ కాలనీ ఫేస్2 వాసులు రోడ్డు పై ఉన్న ట్రాన్స్ ఫార్మర్ తో ఇబ్బందులు పడుతున్నారు.నాలుగో నెంబర్ రోడ్డు మలుపులో సగభాగం రోడ్డుపైనే ట్రాన్స్ ఫార్మర్ ఉంది. పక్కనే ఉన్న ఖాళీ స్థలంలోకి ట్రాన్స్ ఫార్మర్ జరపాలని కాలనీ వాసులు పలు మార్లు ట్రాన్స్ కో అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించు కోలేదని కాకతీయ కాలనీ వాసులు తెలిపారు.కాగా ట్రాన్స్ ఫార్మర్ తొలగించాలంటే అందుకు అయ్యే ఖర్చు భరించాలని అధికారులు చెబుతున్నారని కాలనీ వాసులు తెలిపారు.ట్రాన్స్ ఫార్మర్ కారణంగా వాహనాలు మూల మలుపులో తిరగలేకపోతున్నాయని తెలిపారు. స్కూల్ బస్సుల రాక పోకలకు ఇబ్బంది అవుతోందని వెంటనే ట్రాన్స్ ఫార్మర్ పక్కనే ఉన్న ఖాళీ స్థలం లోకి జరపాలని కాలనీ మాజి అధ్యక్షులు రంగారావు విజ్ఞప్తి చేసారు.

## 19,20 తేదీల్లో ఎన్ఐటి వరంగల్ 24వ స్నాతకోత్సవం



**ప్రజాపక్షం/కాజీపేట :** జాతీయ సాంకేతిక సంస్థ వరంగల్ 24వ స్నాతకోత్సవాన్ని సెప్టెంబర్ 19,20 తేదీల్లో ఎన్ఐటీ వరంగల్‌లోని అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుది తెలిపారు.శుక్రవారం నిట్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో అండర్‌గ్రాడ్యుయేట్, పోస్ట్‌గ్రాడ్యుయేట్, డాక్టరల్ ప్రోగ్రామ్‌లకు చెందిన మొత్తం 1,997 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. 19న ప్రధానంగా అండర్‌గ్రాడ్యుయేట్ పట్టభద్రులకు డిగ్రీలు ప్రదానం చేయనుండగా, సెప్టెంబర్ 20న పోస్ట్‌గ్రాడ్యుయేట్, పీహెచ్‌డీ పట్టభద్రులకు డిగ్రీలు ప్రదానం చేయనున్నట్లు, రెండు రోజుల కార్యక్రమాలు ఉదయం 10:00 గంటలకు ప్రారంభమవుతాయని తెలిపారు. 24వ స్నాతకోత్సవంలో ప్రదానం చేయనున్న వాటిలో అండర్‌గ్రాడ్యుయేట్ డిగ్రీలు 930, పోస్ట్‌గ్రాడ్యుయేట్ డిగ్రీలు 945,పీహెచ్‌డీ డిగ్రీలు100,ఎగ్జిట్ డిగ్రీలు 22లు ప్రదానం చేస్తామన్నారు. ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని, సెమీకండక్టర్ పరిశ్రమలో ఆయన నాయకత్వం, సాంకేతిక ఆవిష్కరణలు, ఇంజినీరింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ, అలాగే సాంకేతిక రంగంలో పట్టభద్రులకు అందుబాటులో ఉన్న అభివృద్ధి అవకాశాలపై విలువైన దృక్కోణాలను అందించనుందన్నారు. ఆనంద్ రామమూర్తికి సెమీ కండక్టర్ అంశంలో చేసిన విశిష్ట కృషికి గుర్తింపుగా గౌరవ డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ డిగ్రీ ప్రదానం చేయబడుతుందని తెలిపారు. ఈ స్నాతకోత్సవంలో అత్యుత్తమ విద్యా ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పాటు, ప్రాజెక్ట్ వర్క్, డిసర్టేషన్‌లు, డాక్టరల్ పరిశోధనల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను కూడా సత్కరించనున్నట్లు తెలిపారు.

## హ్యామ్ రోడ్ల ఒప్పందాలు పూర్తి చేసి పనులు ప్రారంభించాలి

మొదటి పేజీ తరువాయి

దసరా పండుగ లోపే అగ్రిమెంట్ల ప్రక్రియను ముగించాలని కోరారు. పనులు మొదలయ్యాక కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులో ఎలాంటి జాప్యం జరగకుండా ముందస్తుగానే నిధులను సమకూర్చుకోవడానికి ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి అడిగిన ప్రశ్నకు రోడ్లుభవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తక్షణమే స్పందిస్తూ వివరణ ఇచ్చారు. హ్యామ్ ప్రాజెక్టు కింద చాలావరకు అగ్రిమెంట్ల ప్రక్రియ ఇప్పటికే పూర్తయిందని తెలిపారు. వచ్చే 15 రోజుల్లోనే రాష్ట్ర వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో రోడ్ల పనులు ప్రారంభమవుతాయని స్పష్టం చేశారు.ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధుల సమకూర్పుపై ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క నిరంతరం సమీక్షిస్తున్నారని వెల్లడించారు. ఇప్పటికే ఆర్బీఐ, హడ్కో నుంచి రుణ అనుమతులు లభించాయని, నిధుల సమస్య లేదని చెప్పారు. ఈ వర్కింగ్ సీజన్ లోనే ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ శాఖల పరిధిలోని రహదారుల పనులన్నింటినీ వేగవంతంగా పూర్తి చేయడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సభకు వెల్లడించారు.

## డిసిఎస్ సర్వేలో ఆదర్శ మండలంగా కమలాపూర్ నిలవాలి

**ప్రజాపక్షం/కమలాపూర్ః** డిజిటల్ క్రాబ్ బుకింగ్ లో భాగంగా జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు ఆదిరెడ్డి కమలాపూర్ మండలంలోని ఉప్పల్, నేరెళ్ళ, వంగపల్లి గ్రామాలను సందర్శించి డిసిఎస్ వాలంటీర్లు పంటలను ఆన్‌లైన్ చేస్తున్నప్పుడు వారితో పాటు పొలాలను తిరుగుతూ ఆన్‌లైన్ పరిశీలించారు. రైతులు వారి వ్యవసాయ భూముల్లో వేసిన పంటలు వరి, పత్తి, మొక్కజొన్న మొదలగు పంటలను పర్ఫెక్ట్‌గా ఫీల్డ్ మీద ఉన్న పంటలను ఖచ్చితత్వంతో ఆన్‌లైన్ చేయాలని వారికి వివరించారు. అంతేకాకుండా ఈనెల 25 లోపు కమలాపూర్ మండలంలోని అన్ని గ్రామాల్లో డిసిఎస్ సర్వే పూర్తి చేసి కమలాపూర్ మండలాన్ని జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిపేలా కృషి చేయాలని వాలంటీర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి. వేణు, ఏఈవో లు టి. తిరుపతి, బి. ప్రశాంత్, జయప్రకాష్ రెడ్డి, ప్రతాప్, రహీమ్ పాషా, వాలంటీర్లు అనురాగ్, రాము, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## 20న ప్రవేట్ హాస్పిటల్ వర్కర్స్ విస్తృత స్థాయి సమావేశం

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ప్రైవేట్ హాస్పిటల్ లో వివిధ కేటగిరీలలో పనిచేస్తున్న కార్మికులకు జీవో నెంబర్ 6 ప్రకారం వేతనాలు చెల్లించి ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 20న ఆదివారం ఉదయం 11 గంటలకు ఏకశిలా పార్కులో జరిగే జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని హనుమకొండ జిల్లా ప్రైవేట్ హాస్పిటల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బొట్ల చక్రపాణి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.ప్రైవేట్ హాస్పిటల్ లో పని చేస్తున్న అన్ స్కిల్డ్ కార్మికులకు రూ.16000, సెమీ స్కిల్డ్ కార్మికులకు రూ. 17000 స్కిల్డ్ కార్మికులకు రూ. 18500 హై స్కిల్డ్ కార్మికులకు రూ. 20000 జీవో నెంబర్ 6 ప్రకారం ఇవ్వాలని కానీ 8 నుంచి 12 వేల మించి వేతనాలు ఇవ్వడం లేదని, ప్రైవేటు హాస్పిటల్ యజమానులతో పాటు ఏజెన్సీలు శ్రమదోపిడి చేస్తున్నాయని ఆయన అన్నారు.ఈఎస్ఐ,పిఎఫ్, అపాయింట్మెంట్ ఆర్డర్ ప్రమాద బీమా సౌకర్యం రెస్ట్ రూమ్ క్యాజువల్ ,జాతీయ, రాష్ట్ర పండుగల సెలవులు లాంటి చట్టబద్ధమైన హక్కులు అమలు కావడం లేదని ఆయన అన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం చర్చించి భవిష్యత్తు పోరాటాలకు రూపకల్పన చేయబోయే సమావేశంలో కార్మికులు అధిక సంఖ్యలో ని జయప్రదం చేయాలని చక్రపాణి పిలుపునిచ్చారు.

## సిఐని కలిసిన నర్సక్కపల్లి ఉపసర్పంచ్

**ప్రజాపక్షం/పరకాల:** పరకాల సీఐ ప్రవీణ్ ను నర్సక్కపల్లి ఉపసర్పంచ్ వర్ణం శ్రీధర్ రెడ్డి కలిసి చాలువాతో సన్మానించారు. పరకాల సిఐ ప్రవీణ్ బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయనను ఉపసర్పంచ్ శ్రీధర్ రెడ్డి అదేవిధంగా నర్సక్క పల్లి గ్రామం రెడ్డి సంఘం అధ్యక్షుడు పాడి చంద్రారెడ్డి కోడెపాక కుమార్ స్వామి సిఐని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామాలలోకి ఎవరైనా అపరిచిత వ్యక్తులు వస్తే పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని ఆయన ఉపసర్పంచ్ కోరారు. గ్రామంలో శాంతిభద్రతలను కాపాడటంలో స్థానిక ప్రజాప్రతినిధులు ప్రధాన పాత్ర పోషించాలని సిఐ అన్నట్లు ఉపసర్పంచి తెలిపారు.

## 4వే సెగ్రిగేషన్‌పై విద్యార్థులకు అవగాహన

**ప్రజాపక్షం/చిట్యాల:** స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజ్(గర్ల్స్)లో విద్యార్థులకు 4వే సెగ్రిగేషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు కొనసాగుతున్న కార్యక్రమంలో భాగంగా గ్రీన్, బ్లూ, రెడ్, బ్లాక్ బిన్ల వినియోగం, తడి, పొడి, ప్రమాదకర, ఇతర వ్యర్థాలను వేర్వేరుగా సేకరించే విధానంపై విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా పంచాయతీ సెక్రటరీ దేవేందర్ రెడ్డి విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయబోమని, వ్యర్థాలను వేర్వేరుగా సేకరిస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బిక్షపతి, వార్డు మెంబర్ తౌటం నవీన్, పంచాయతీ సెక్రటరీ దేవేందర్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అథ్లెటిక్స్‌లో బండారుపల్లి విద్యార్థికి బంగారు పతకం

**ప్రజాపక్షం/ములుగు:** బండారుపల్లి పిఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాల విద్యార్థి గుడెల్లి బాచి అథ్లెటిక్స్‌లో సత్తా చాటాడు. పుదుచ్చేరిలోని ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించిన దక్షిణ జోనల్ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో 1000 మీటర్ల మిడ్లే రిలే విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతక సాధించాడు. బాచి విజయం పట్ల కళాశాల ప్రిన్సిపల్ సింగారం దేవకి, అధ్యాపకులు ఫోన్‌లో అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో మరిన్ని విజయాలు సాధించి కళాశాలకు, ములుగు జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. బాచి విజయం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

## బిజెవైఎం మండల అధ్యక్షుడిగా బూరుగు పాయి కుమార్ గౌడ్



**ప్రజాపక్షం/గూడూరు:** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల భారతీయ జనతా యువ మోర్చా(బీజేవైఎం) మండల అధ్యక్షుడిగా అయోధ్యపూరం గ్రామానికి చెందిన బూరుగు సాయి కుమార్ గౌడ్ నియమితులయ్యారు. ఈసందర్భంగా తన నియామకానికి సహకరించిన బీజేపి జిల్లా అధ్యక్షులు దిడ్డి మహేష్‌తో పాటు గూడూరు మండల జిల్లా నాయకులకు సాయి కుమార్ గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. మండలంలోని యువతను బీజేపితో అనుసంధానం చేస్తూ యువత సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. బీజేపీ నాయకలు కార్యకర్తల సహకారంతో బీజేవైఎంను గూడూరు మండలంలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని సాయి కుమార్ గౌడ్ తెలిపారు.

## రెవెన్యూ దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలి



**ప్రజాపక్షం/నడికూడ :** రెవెన్యూకు సంబంధించిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉండకుండా నిర్ణీత గడువులోగా పరిష్కార చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశించారు.శుక్రవారం హనుమకొండ జిల్లా నడికూడ మండల తహసిల్దార్ కార్యాలయంలో జరుగుతున్న భూభారతి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. దరఖాస్తుల పరిశీలన, పరిష్కారానికి తీసుకుంటున్న చర్యల గురించి తహసీల్దార్ రాణి, ఇతర అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.కార్యాలయంలోని రికార్డు రూము నిర్వహణ తీరును కలెక్టర్ పరిశీలించారు. రికార్డు రూముకు సంబంధించిన పలు అంశాలను తహసిల్దార్ ను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు.నడికూడలో నిర్మాణంలో ఉన్న పాల శీతలీకరణ కేంద్రం భవనం పనులను కూడా కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.అదేవిధంగా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం పనులను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు.ధర్మారం–నడికూడ మధ్య కొత్తగా నిర్మించిన బ్రిడ్జిని కలెక్టర్ పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎంపీడీవో రామకృష్ణ, ఇతర శాఖల అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## గంగపుత్ర పట్టభద్రులు విధిగా ఓటు నమోదు చేసుకోవాలి



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** తెలంగాణ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో నల్గొండ ఖమ్మం వరంగల్ జిల్లాల పరిధిలోని గంగపుత్ర పట్టభద్రులందరూ అప్రమత్తంగా ఉండి తమ ఓటును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర పిలుపునిచ్చారు.ప్రస్తుత ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్న పట్టభద్రులు సైతం కొత్తగా మార్చిన ఫారం–18లో మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని ఎన్నికల సంఘం స్పష్టం చేసిందని ఆయన తెలిపారు దరఖాస్తుతో పాటు అవసరమైన ధ్రువపత్రాలు సర్టిఫికెట్ల ధృవీకరించిన కాపీలను సమర్పించాలని సూచించారు.గంగపుత్ర సమాజానికి చెందిన ప్రతి పట్టభద్రుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ఎన్నికల సంఘం సూచించిన విధంగా అవసరమైన పత్రాలను సిద్ధం చేసుకుని సమయానికి ఫారం–18 దరఖాస్తు సమర్పించి ఓటర్ల జాబితాలో తన పేరును నమోదు చేసుకోవాలని రాజేష్ ఖన్నా గంగపుత్ర కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, గంగపుత్ర పట్టభద్రులందరూ తమ హక్కును వినియోగించుకునేలా సంఘం తరఫున విస్తృతంగా అవగాహన కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.

## ఉద్యమకారులంతా తరలిరావాలి



**ప్రజాపక్షం/చిట్యాలః** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం 9వ వార్షికోత్సవ వేడుకలు ఈ నెల 27న యాదగిరిగుట్టలో నిర్వహించనున్నట్లు ఫోరం మండల అధ్యక్షుడు జన్నె యుగేంధర్ తెలిపారు. రాష్ట్రంలోని తెలంగాణ ఉద్యమకారులంతా పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. చిట్యాల మండల కేంద్రంలో శుక్రవారం హలో కళాకారుడా..ఛలో యాదగిరిగుట్ట కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుగేందర్ మాట్లాడుతూ ఉద్యమకారుల సంక్షేమం, హక్కుల సాధన కోసం ఫోరం తొమ్మిదేళ్లుగా పోరాడుతోందన్నారు. ఫోరం వ్యవస్థాపకుడు, రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీను ఆధ్వర్యంలో ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి పలు కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ఉద్యమకారుల సంక్షేమ అంశాలను వివరించి, వాటిని ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరిచేలా కృషి చేసినట్లు పేర్కొన్నారు. యాదగిరిగుట్టలో జరిగే వార్షికోత్సవానికి ఉద్యమకారులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కాట్రేవుల కుమార్, సాధ మల్లయ్య, కన్నబోయిన అశోక్, కంచర్ల కుమారస్వామి, సంఘ రాజేందర్, జాలిగపు కృష్ణయ్య, బయగాని తిరుపతి, వేముల శీను, చెక్క నర్సయ్య, బొట్ల రవి, గొర్రె సతీష్, శ్రీరామ్ సదయ్య, భోగం నర్సయ్య, బానోతు రాజు నాయక్, రాయిని శ్రీకాంత్, దేవరకొండ సత్యనారాయణ, ధారావత్ రాజు నాయక్, ఉప్పుల కిరణ్, బండారి శ్రీను, పరమేశ్వర్, బండి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ విద్యకు గ్రామం నుంచి చేయూత

**ప్రజాపక్షం/కాళేశ్వరం:** విద్యార్థులను అధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తీర్చిదిద్దడమే లక్ష్యంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలోని పిఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్,అటల్ టింకరింగ్ 3డి ప్రింటర్‌ను గ్రామ సర్పంచ్ వెన్నపురెడ్డి మోహన్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సాంకేతిక ఆలోచన విధానం, సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడంలో కంప్యూటర్ ల్యాబ్, అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు కీలకపాత్ర పోసిస్తాయని పేర్కొన్నారు.ముఖ్యంగా అధునిక సాంకేతికతను పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా చూసి నేర్చుకునే స్థాయి నుంచి సృష్టించి నేర్చుకునే స్థాయికి ఎదగడానికి అవకాశం కల్గుంతుందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు యూనిఫాం బెల్టులు, షూలను సర్పంచ్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అందజేసారు. విద్యార్థులకు విద్యాభివద్ధితో పాటు వారికి సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి అవసరమైన వసతులు కల్పించేందుకు పాఠశాల ఉపాధ్యాయుల కృషిని ఆయన అభినందించారు. పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు రాజేందర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు అధునిక సాంకేతిక వనరులను అందుబాటులోకి తీసుకరావడంలో భాగంగా కంప్యూటర్ ల్యాబ్, అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను సమర్థవంతంగా వినియోగిస్తామని తెలిపారు. 3డి ప్రింటర్ ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు, ఆవిష్కరణల పట్ల ఆసక్తి, శాస్త్రీయ దృక్పథం మరింత పెంపొందించేలా కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చెమ్మాల సుధీర్, కార్యదర్శి శ్రీధర్, వార్డు సభ్యులు సయ్యద్ ఇమ్రాన్, పానెం సంతోష్, పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు మీ సేవా కేంద్ర అభ్యర్థులకు పరీక్ష

**ప్రజాపక్షం/జనగామ:** జనగామ జిల్లాలో కొత్తగా 17 మీ సేవా కేంద్రాలు ఏర్పాటు చేయనుండగా వాటికి సంబందించిన అభ్యర్థ జాబితా ఫైనల్ అయినందున శనివారం పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తెలిపారు. 17 మీ సేవా కేంద్రాల కోసం అనేక మంది ధరఖాస్తు చేసుకోగా వారి జాబితాను వెబ్‌సైట్‌లో పెట్టడం జరిగిందన్నారు. శనివారం ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు ఐడిఓసి మీటింగ్ హాల్‌లో పరీక్ష ఉంటుందన్నారు. తుది అర్హుల జాబితాలో పేర్లు ఉన్న అభ్యర్థులు నిర్ణీత సమయంలో పరీక్ష కేంద్రాలకు చేరుకొని పరీక్షలు వ్రాయాలన్నారు.

## పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యమైన సమాజం

**ప్రజాపక్షం/లింగాలఘణపురం:** పరిసరాలు ఆరోగ్యమైన సమాజం అనే సందేశంతో ప్రతి ఒక్కరు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని స్వచ్ఛతను జీవితంలో భాగంగా చేసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి శివ శంకర్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. మండలం లోని బండ్ల గూడెం గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం చెత్తను తొలగించడం పరిసరాలలో పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోరెడ్డి సంతోషి మల్లారెడ్డి, బిఎస్ఎం కర్ణాకర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి జ్యోతి, ఉప సర్పంచ్ నవీన్, కస్తూర్బా గాంధీ ప్రిన్సిపల్ సుకన్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సిఐని మర్యాదపూర్వకంగా కలిసిన టిడిపి నాయకులు



**ప్రజాపక్షం/రఘునాథ-పల్లి :** ఇటీవల బదిలీపై జనగామ రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టిన జి.వేణును శుక్రవారం టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు బొక్క రామచంద్రయ్య (చంద్రబాబు) ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులంతా మర్యాదపూ ర్వకంగా కలవడం జరిగింది. అనంతరం టిడిపి శ్రేణులంతా కలిసి సీఐ వేణును శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. సిఐని కలిసిన వారిలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొంగరి నర్సింగరావు, టిడిపి మైనార్టీ సెల్ రాష్ట నాయకుడు ఎండి జహంగీర్, నాయకులు కొమ్మారెడ్డి రాజారెడ్డి, నకీర్త సత్తయ్య, ఇమ్మడిశెట్టి నాగేష్, కాదునూరి మధుసూదన్, రవి, మండల తెలుగు యువత అధ్యక్షుడు మాస శివ శంకర్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

## భాస్కర్‌ను పరామర్శించిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎల్లయ్య

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** జఫర్‌గడ్ వడ్డేగూడెం ఎస్సీ కాలనీకి చెందిన బొజ్జ భాస్కర్ తల్లి బుచ్చమ్మ ఇటీవల మృతిచెందగా విషయం తెలుసుకున్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎల్లయ్య వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహాయం అందించి వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ మార్కెట్ డైరక్టర్ బాబు, మండల యూత్ అధ్యక్షులు రాజేందర్, నాయకులు అనిల్, కిరణ్, ఎల్లస్వామి, రాజు, అంజయ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరుల ఆశయాలను కొనసాగించాలి

**ప్రజాపక్షం/పాలకుర్తి:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్న అమరుల ఆశయాలను కొనసాగించాలని మార్క్సిస్టు లెనినిస్టు పార్టీ ఆఫ్ ఇండియా రెడ్ ఫ్లాగ్ రాష్ట్ర కార్యదర్శి ఎండి కాసీం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని, హిందూ, ముస్లీం మధ్య జరిగిన పోరాటమని వక్రీకరించేందుకు బీజేపి కుట్ర చేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బుజేందర్, రాష్ట్ర నాయకులు భాస్కర్, యాకన్న, అంజన్న, అబ్బాస్, ఉమా, లక్ష్మి , నబీన్ సాబ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలకు ఎంఎల్ఏకు ఆహ్వానం



ప్రజాపక్షం/నెక్కొండ : సూరిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న జోనల్ స్థాయి క్రీడా పోటీల ప్రారంభోత్సవానికి నర్సంపేట ఎంఎల్ఏ దొంతి మాధవరెడ్డిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల బృందం ఆహ్వానించింది. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాధవరెడ్డి ఉపాధ్యాయ బృందాన్ని సన్మానించి గురువులపై తనకున్న ఉదార స్వభావాన్ని చాటుకున్నారు. విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి స భ్యులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, మండల కాం గ్రెస్ అధ్యక్షుడు లావుడ్య తిరుమల్ చౌహాన్, సూరిపల్లి సొసైటీ చైర్మన్ మాదాటి శ్రీనివాస్, రెడ్లవా డ సొసైటీ చైర్మన్ ఆవుల శ్రీనివాస్, పాల్గొన్నారు.

## ఎంఆర్‌పిఎస్ గ్రామ కమిటీల ఎన్నిక

ప్రజాపక్షం/నెక్కొండ : పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు నెక్కొండ మండలం పెద్దకొర్పోల్, నాగారం గ్రామాలలో ఎంఆర్‌పిఎస్ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పెద్దకొరుపోలు గ్రామ అధ్యక్షుడిగా బిర్రు కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా సురేష్, ఉపాధ్యక్షుడిగా మట్టే రాకేష్, కోశాధికారిగా తక్కెళ్ల పల్లి నవీన్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా మనోహర్, నాగరాజు, నితీష్, విన య్, ఆదిత్య, చింటూలను ఎన్నుకున్నారు. అలాగే నాగారం గ్రామ అధ్యక్షుడు కార్యదర్శులుగా కొమ్ము నగేష్, కడారి ప్రశాంత్‌లు ఎన్నుకోబడ్డారు. సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ మం డల నాయకు లు వెంకన్న, సీనియ ర్ నాయకులు మట్టే శ్రీనివాస్, మట్టే కృష్ణ, సా రయ్య, పాల్గొన్నారు.

## ప్రసాద్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రజాపక్షం/నెక్కొండ : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఉద్దేశించి కల్పిత నాయకుడు పేరుతో పుస్తకం ప్రచురించడాన్ని నిరసిస్తూ నెక్కొండ మండలంలోని దళిత ప్రజా సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. అంబేద్కర్ రాజ్యాంగ రూపకల్పనలో కీలకపాత్ర పోషించిన జాతీ య నాయకుడని, ఆయనను అవమానించేలా ఉన్న వ్యా ఖ్యలు, ప్రచురణలపై ప్రభు త్వం చట్టం ప్రకా రం చర్యలు తీసుకోవాలని నాయకులు కోరా రు. దళితులు, గిరిజనులు, అంబేద్కర్‌వాదుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని పుస్తకానికి సంబంధించిన అంశాలను పరిశీలించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ టిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యాకయ్య మాదిగ, ఏఐటియూసి జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు, అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు మాంకాల యాదగిరి, ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షుడు ఈదునూరి వెంకన్న, కొంగర సూర్యరావు, డాక్టర్ వెంకటేశ్వర్లు, మాజీ ఎంపిటిసి ఈదునూరి ప్రభాకర్, మంద సురేష్, మందుల పరమాత్మ, శ్రావణ్ కుమార్, ఈదునూరి శివాజీ, పాల్గొన్నారు.

# కెసిఆర్ అక్రమ భూముల వ్యవహారంపై విచారణ జరిపించాలి

టిజెఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబటి శ్రీనివాస్



ప్రజాపక్షం/ నర్సంపేట : రాష్ట్ర అసెంబ్లీ సాక్షిగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించినట్లు కెసిఆర్ కుటుంబం చరబట్టిన భూముల వ్యవహారంపై సమగ్ర విచారణకు ముఖ్యమంత్రి ఆదేశించాలని అలాగే దోషులు ఎంతటి వారైనా కఠిన శిక్షలు పడేలా చర్యలు చేపట్టాలని టిజెఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబటి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో సకల జనులు సబ్బండ వర్గాలు రాష్ట్ర సాధనకు అంకితమై పోరాడుతుంటే ఉద్యమాన్ని అడ్డం పెట్టుకొని కెసిఆర్ కుటుంబం అప్పటినుంచి తెలంగాణ సంపదపై కన్నేసిందని దండుకోవడం మొదలుపెట్టిందని ఆరోపించారు. రాష్ట్రం వచ్చినంక అధికారం చేతిలోకి అందినంక కెసిఆర్ కుటుంబ దోపిడీకి అడ్డు అదుపు లేకుండా పోయిందన్నారు. ఉద్యమంలో ముందుండి కొట్లాడిన నాయకులందరినీ రాష్ట్రం వచ్చినంక ఏదో ఒక వంకతో వాళ్లపై కేసులు పెట్టి జైల్లోకి పంపిన నీచమైన చరిత్ర కెసిఆర్‌ది అని అన్నారు. అసలు సిసలైన తెలంగాణ ఉద్యమ నాయకులను కాదని, తెలంగాణ ద్రోహులను తన పంచాన చేర్చుకొని హైదరాబాద్ చుట్టుపక్కల గల వేలాది విలువైన ప్రభుత్వ భూములను కొల్లగొట్టిన కేసీఆర్ కుటుంబం ఎవ్వరికీ అందనంత ఎత్తు ఎదిగిందని అనేక తరాలకు కావలసిన సంపదను దోపిడీ చేశారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రాణాలర్పించిన అమరుల కుటుంబాలు, అలాగే వేలాదిమంది ఉద్యమంలో పాల్గొని ఆర్థికంగా మానసికంగా శారీరకంగా ఎన్నో నష్ట కష్టాలను భరించి తెలంగాణ రాష్ట్రం వస్తే తమకు ఏదో మేలు జరుగుతుందని భావించిన వారందరి నోట్లో కేసీఆర్ మట్టి కొట్టాడన్నారు. ఈ కార్యక్రమంలో టిజేఎస్ జిల్లా అధ్యక్షులు షేక్ జావిద్, రాష్ట్ర నాయకులు గుంటి రామచందర్, బోనగాని రవీందర్, జిల్లా నాయకులు మహబూబ్ అలీ, సాంబరాతి మల్లేశం, సోల్తి సాయికుమార్, రాజు, సంధాని తదితరులు పాల్గొన్నారు.

# పంటల సాగుపై రైతులకు అవగాహన



ప్రజాపక్షం/ఖానాపురం : రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త రాజ్‌కుమార్ సూచించారు. ఖానాపురం మండలంలో రైతులకు వివిధ పంటల సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వరి, మొక్కజొన్న, పత్తి, అపరాల్లో వచ్చే తెగుళ్లు, నివారణ చర్యలను వివరించారు. ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా మినుము, పెసర, కంది, తదితర పంటలను సాగు చేయాలని సూచించారు. ఉద్యానవన అధికారి తరుణ్ మాట్లాడుతూ కూరగాయలు, పందిరి కూరగాయల సాగుతో పాటు పామాయిల్, పండ్ల తోటల వైపు రైతులు దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న డ్రిప్, ఇతర సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నర్సంపేట ఆత్మ డివిజన్ అధ్యక్షుడు ఎడ్ల బిక్షంరెడ్డి మాట్లాడుతూ నీ టి వసతి ఉన్న రైతులు పామాయిల్, పండ్ల తోటలు సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చన్నారు. నర్సంపేట ఏఎంసి వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు మాట్లాడుతూ ఎరువుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాప్ ద్వారా రైతులు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలని సూచించారు. పట్టా భూములు లేని రైతులకు కూడా వ్యవసాయశాఖ స హకారంతో ఎరువులు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికా రి శ్రీనివాస్, సర్పంచ్‌లు, ఏఈఓలు, రైతులు, పాల్గొన్నారు.

# కుట్టు శిక్షణతో మహిళలకు ఆర్థిక స్వావలంబన

ప్రజాపక్షం/ఖిలా వరంగల్ : మహిళలు స్వయం ఉపాధి సాధించి కుటుంబానికి అండగా నిలవాలనే లక్ష్యంతో అందిస్తున్న కుట్టు శిక్షణ అభినందనీయమని డిఆర్‌డిఏ జేడిఎం శ్రీనివాస్ అన్నారు. ప్రేమ్ హెల్పింగ్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన కుట్టు మిషన్ శిక్షణను పూర్తి చేసిన మహిళలకు శుక్రవారం సర్టిఫికేట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హాజరైన డిఆర్‌డిఏ జేడిఎం శ్రీనివాస్, ఎంప్లాయిమెంట్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎస్ భాస్కర్ తమ చేతుల మీదుగా 20 మంది మహిళలకు ధృవపత్రాలను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలు కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకుని స్వయంగా ఉపాధి పొందాలని ఆకాంక్షించారు. తద్వారా కుటుంబ ఆర్థిక పరిస్థితికి తోడ్పడంతో పాటు తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. మహిళలకు ఇలాంటి నైపుణ్య శిక్షణ అందిస్తున్న ప్రేమ్ హెల్పింగ్ ట్రస్టు చైర్మన్ ప్రేమ్‌కుమార్‌ను అభినందించారు. ట్రస్టు ద్వారా కొనసాగుతున్న సేవా కార్యక్రమాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఎంప్లాయిమెంట్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎస్ భాస్కర్ మాట్లాడుతూ ప్రేమ్ హెల్పింగ్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేలా నైపుణ్య శిక్షణ అందించడం అభినందనీయమని, తమవంతు సహకారం అందిస్తామని చెప్పారు. ట్రస్టు చైర్మన్ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ మహిళలకు కుట్టు శిక్షణతో పాటు బ్యూటీషియన్, మగ్గం తదితర నైపుణ్యాలను నేర్పిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన ప్రతి ఒక్కరూ వాటిని ఉపాధి అవకాశాలుగా మలుచుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ఆర్గనైజర్ ఆదిత్య, ట్రస్టు ఇన్‌చార్జి సుగుణ, ట్రైనర్ గ్రీష్మ, తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్‌పై తప్పుడు ప్రచారాన్ని అడ్డుకోవాలి

ప్రజాపక్షం/నల్లబెల్లి : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అసత్య ,కల్పిత ప్రచారాన్ని అడ్డుకోవాలని దళితమేదశక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ల పవన్ ప్రభుత్వాన్ని కోరారు . శుక్రవారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని బోల్లోనిపల్లి గ్రామంలో దళితమేదశక్తి గ్రామ కమిటి ఏర్పాటు చేయుటకు ముఖ్య అతిథిగా విచ్చేసిన పవన్ మాట్లాడారు . రాజ్యాంగ వ్యవస్థను బలమీన పరిచే ప్రయాత్నాల్లో బాగంగానే అంబేద్కర్‌పై తప్పుడు ప్రచారం జరుగుతోందని అరోపించారు . అంబేద్కర్ చిన్నానాటే నుంచే అనేక అవమానాలను ఎదుర్కోంటు ఉన్నత విధ్యను అభ్యసించి ప్రపంచ మేధావిగా గుర్తింపు పొందరని తెలిపారు .ఈ సందర్భంగా గ్రామంలో దళిత మేధశక్తి గ్రామ కమిటి నియమకంలో అధ్యక్షుడిగా బరుపట్ల నరేష్ ,ప్రదాన కార్యదర్శి రుద్రరపు రవి ,అధికార ప్రతినిధి బరుపట్ల రాజపోషాలు ,సభ్యులుగా పెంబర్తి రాజ్‌కుమార్ ,రమేష్ లను ఎన్నుకున్నారు . ఈ కార్యక్రమంలో వ్యవస్థపక కమి టి సభ్యులు పెంబర్తి శ్రీనివాస్ ,కుమారస్వామి , రవి ,పెంబర్తి రాజయ్య పాల్గోన్నారు .

## డ్రైనేజి పనుల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న మున్సిపల్ అధికారులు



ప్రజాపక్షం/ నర్సంపేట: నర్సంపేట మున్సిపాలిటీ బస్టాండ్ ఆవరణలోని ప్రధాన రహదారిపై చేపడుతున్న డ్రైనేజీ పనుల తీరుపై బిఆర్ఎస్ కౌన్సిలర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నర్సంపేట పట్టణంలోని ప్రధానరహదారిలో పారుతున్న మురుగునీటిని పరిశీలించారు. ఈసందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ డ్రైనేజీ కాలువల్లో పేరుకుపోయిన మురుగును తొలగించే పేరుతో పనులు చేపడుతున్నప్పటికీ, పనులు పూర్తిస్థాయిలో నిర్వహించకుండా రోడ్లపై మురుగు, మట్టి పేరుకుపోయేలా చేసి ప్రజలకు, వ్యాపారులకు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారన్నారు. సుమారు రూ.10 లక్షల టెండర్లను దక్కించుకున్న అధికార పార్టీ నాయకులు చెబుతున్న ఈ పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ కౌన్సిలర్లు బానోత్ నవీన్ నాయక్, శివరాత్రి స్వామి, మండల శ్రీదేవి శ్రీనివాస్, కీర్తి దృశ్యంత్, రమ్య సంతోష్, బుస శిరీష రాజు, నాయిని వేణు, పైసా ప్రవీణ్, పల్నాటి సందీప్, బాగి రాజు పాల్గొన్నారు.

## కరువు సహాయక చర్యలు వెంటనే చేపట్టాలి

ప్రజాపక్షం/ వరంగల్ : జిల్లాలో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని వెంటనే కరువు సహాయక చర్యలు చేపట్టాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకెఎంఎస్) ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐకేఎంఎస్ ప్రతినిధి బృందం వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఓ విజయలక్ష్మి కి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రాచర్ల బాలరాజు మాట్లాడుతూ వరంగల్ జిల్లాలోని 13 మండలాల్లో గత జూన్ నుండి ఇప్పటివరకు సగటు వర్షపాతం కంటే తక్కువగానే నమోదు అయిన మూలంగా చెరువులు కుంటలు బావులు ఎండిపోతున్నాయని అన్నారు. ఈ పరిస్థితిలో వ్యవసాయ పంటలు పండక రైతులు, కౌలుదారులు భారీగా నష్టపోతున్నారని ఒక్క ఎకరానికి ఇప్పటివరకు 20వేలకు పైగా ఖర్చు చేశారని వ్యవసాయ కూలీలకు కూడా పని లేక పట్టణాలకు వలసపోయే దుస్థితి ఏర్పడిందన్నారు. రైతుల, కౌలు రైతుల పంట నష్టం ప్రాతిపదికగా నష్టపరిహారం అందించాలని, వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి 12 వేల రూపాయలు ఇస్తాం అన్న ప్ర భుత్వము ఇంతవరకు ఒక్క పైసా కూడా ఇవ్వలేదని, గత మూడు సంవత్సరాల డబ్బులను వారికి అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. డిఆర్ఓ ను కలిసిన వారిలో ఏఐకెఎంఎస్ ఉమ్మ డి అధ్యక్షులు తిరుపతి, ఉపాధ్యక్షులు సాంబయ్య, జిల్లా ప్రధాన కార్యద ర్శి రాజేందర్, ప్రధాన కార్యదర్శి బన్న నర్సింగం, ప్రగతిశీల మ హిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలువేరు పూలక్క ఉన్నారు.

## జాతీయ ఆరోగ్య మిషన్ సేవలు గ్రామస్థాయిలో అందించాలి

ప్రజాపక్షం/ వరంగల్: జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) సేవలను గ్రామస్థాయిలో అందించాలని వరంగల్ జిల్లా వైద్యా ఆరోగ్యశాఖ అధికారి రాజారెడ్డి అన్నారు. వరంగల్‌లోని ఎంజిఎం ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహిస్తున్న వివిధ జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్ వెన్షన్ ప్రారంభించిన సెంటర్ (డిఈఐసి), యుఎఫ్‌డబ్లుసి, ఎస్ఎన్‌సియు, ఎన్ఆర్‌సి యూనిట్లను సందర్శించి అక్కడ అందిస్తున్న వైద్య సేవలను, సిబ్బంది పనితీరును, రికార్డులు రిపోర్టుల నిర్వహణను పరిశీలించారు. యుఎఫ్‌డబ్లూసిలో మహిళలకు అందుతున్న ఆరోగ్య సేవలు, రికార్డుల నిర్వహణ, సేవల నాణ్యతను పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడం, రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించడం, సేవలలో ఎలాంటి లోపాలు లేకుండా చూడటం, లబ్ధిదారుల సంతృప్తికి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రాజారెడ్డి సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి (సిహెచ్ ఐ/డిప్యూటీ డిఎంహెచ్‌ఓ) డాక్టర్ ప్రకాష్, డిపిఓ అర్చన పాల్గొన్నారు.

## జాతీయ పోషణ మాసం దినోత్సవం



ప్రజాపక్షం / నిజాంపేట్ : జాతీయ పోషణ మాసం సందర్భంగా నస్కల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రోజున పోషణ మాసం కార్యక్రమం సూపర్వైజర్ లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సూపర్వైజర్ లక్ష్మీ మాట్లాడుతూ కిశోర బాలికలకు పోషణ లోపం లేకుండా ఉండ దానికి సరియైన ఆహారము తీసుకోవాలని పౌష్టికాహారం గురించి వివరించడం జరిగింది. ఆహార పదార్థాలలో భాగంగా ఆకు కూరలు, కూరగాయలు, పాలు మరియు పండ్లు తీసుకోవాలి అని వ్యక్తిగత పరిశుభ్రత ప్రాముఖ్యతల పాటించాలని తెలియజే యడం జరిగింది. అనంతరం పోషణ అభి యాన్పై ప్రతిజ్ఞ నిర్వహించడం జరిగింది.

## గ్రీన్ డే కార్యక్రమం



ప్రజాపక్షం/నిజాంపేట్: నిజాంపేట మండల పరిధిలోని రాంపూర్ ప్రాథమిక పాఠశాల ప్రీ ప్రైమరీలో శుక్రవారం గ్రీన్ డే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో భాగంగా పాఠశాల ప్రధానో పాధ్యాయులు పర్శ రాములు పర్యావరణ పరిరక్షణ కోసం, ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని చెప్పడం జరిగింది.

## వంటగది లేక పాఠశాలలో విద్యార్థులకు ఇబ్బందులు

ప్రజాపక్షం/నిజాంపేట్ : నిజాంపేట మండల పరిధిలోని కాశీంపూర్ తాండ గ్రామంలోని ఎంపీపీఎస్ ప్రీ ప్రైమరీ పాఠశాలలో 35 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. అయితే పాఠశాలలో వంటగది సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మధ్యాహ్న భోజనం తయారీలో కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు చొరవ చూపి పాఠశాలలో వంటగది నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు.

## అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాపక్షం /సంగారెడ్డి: తారా ప్రభుత్వ కళాశాల సంగారెడ్డిలో డిగ్రీ విద్యార్థులకు బోధించుటకు వివిధ విభాగాలలో అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరడం జరుగుతున్నదని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం ప్రవీణ ఒక ప్రకటనలో తెలిపారు. తారా కళాశాలలో బి.బి.ఎ రిటైల్ ఆపరేషన్స్ లో ఒకటి బిసిఏ (కంప్యూటర్ అప్లికేషన్ ) ఒకటి పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అభ్యర్థులు ఆయా పోస్టులకు సంబంధిత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్ లో కనీసం 55 శాతం మార్కులతో పాసై ఉండాలని ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు ఉంటే సరిపోతుందని అనుభవము, నెట్ స్లేట్ పీహెచ్డీ అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు తారా కళాశాలలో ఈ నెల 19 వ తేదిన జరిగే డెమో ,ఇంటర్వ్యూ కు ఒరిజనల్ సర్టిపికెట్లు ఒక జిరాక్స్ సెట్ కాపీలతో అటెండ్ కావాలని ప్రిన్సిపాల్ ఎం.ప్రవీణ తెలిపారు.

## నాగేందర్‌పై అనర్హత వేటు సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్‌కు చెంపపెట్టు



ప్రజాపక్షం/ సిద్దిపేట : అంతరించిపోతున్న కలలను కాపాడుకోవాల్సిన అవసరం అందరిపై ఉందని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బైండ్ల,పోతరాజు, పంబాల,కొలుపుల సంఘాల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సిద్దిపేటలో పది కాలాలు ఉండి ప్రజలకు అవసరపడే పనులను చేశాను. బైండ్ల,పంబాల,పోతురాజుల,కొలువుల సంఘాలకు అండగా ఉంటా.. కెసిఆర్ ప్రవేశపెట్టిన గురుకులాల్లో మీ పిల్లల్ని చదివించండి. ఐక్యతతో ఉండి అందరికీ ఆద ర్శంగా నిలవాలి.. కడుపునిండా అన్నం పెట్టి గౌరవించే గొప్ప సంస్కృతి సిద్దిపేట వారిది..సిద్దిపేట అభివృద్ధికి రోల్ మోడల్. ప్రపంచంలోని ప్రతి దేశంలో మన కలలు,సంస్కృతి కనబడుతుంది.. రానున్నది బిఆర్ఎస్ సర్కార్ మీ జాతికి అండగా నిలుస్తామన్నారు. సిద్దిపేటలో మీ జాతికి గౌరవం దక్కేలా మంచి భవనం నిర్మించి ఇస్తానని మాజీ మంత్రి హరీష్‌రావు స్పష్టం చేశారు.

**దానం నాగేందర్‌పై అనర్హత వేటు రేవంత్‌రెడ్డి, స్పీకర్‌కు చెంపపెట్టు**

ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై హైకోర్టు అనర్హత వేటు వేయటం కాంగ్రెస్ పార్టీకి సీఎం రేవంత్‌రెడ్డి,స్పీకర్ గడ్డం ప్రసాద్‌రావుకు చెంపపెట్టులాంటిదన్నారు. రాహుల్‌గాంధీ రాజ్యాంగం చేత పట్టుకొని నీతులు చెపుతారని హైకోర్టు తీర్పు చెంపపెట్టు అన్నారు.

## బాలగణేష్ మంటపంలో అన్నదాన మహోత్సవం



ప్రజాపక్షం/అల్లాదుర్గం: మండలం లోని చిల్వర్ గ్రామంలో వెలసిన బాలగణేష్ వినాయక మండపంలో గురువారం అన్నదాన కార్యక్రమం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని చిల్వర్ గ్రామంలో యువకులు, గ్రామస్తులు కలిసి బాలగణేష్ మండపాన్ని ఏర్పాటు చేసి, అంగరంగ వైభవంగా ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే గురువారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ అన్నదాన మహోత్సవానికి గ్రామానికి చెందిన ప్రముఖులు, దాతలు అయిన కొర్పోల్ భూమయ్య, మేతరి దుర్గయ్య ముందుకు వచ్చి తమ వంతు ఆర్థిక సహాయాన్ని అందించి, అన్నదానానికి సహకరించారు. వారి ఉదార సహకారంతో గ్రామంలోని వందలాది మంది భక్తులకు, మహిళలకు, యువకులకు, చిన్నారులకు కడుపు నిండా అన్నప్రసాదాన్ని అందజేశారు.

## దోమల నివారణపై ప్రత్యేక దృష్టి..

ప్రజాపక్షం/మనోహరాబాద్ : మనోహరాబాద్ మండలంలోని కళ్లకల్ గ్రామంలో శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సంబంధిత అధికారులు,ఆరోగ్య సిబ్బందితో కలిసి గ్రామంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి దోమల వృద్ధికి అనుకూలంగా ఉన్న పరిస్థితులను పరిశీలించారు.ముఖ్యంగా ఇళ్ల పరిసరాల్లో,నీటి నిల్వ ప్రాంతాల్లో దోమల లార్వా వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని,కొబ్బరి బొండాలు, పాత టైర్లు, ఖాళీ పాత్రలు, ఇతర వస్తువుల్లో నీరు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే ప్రతి కుటుంబం తమ ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వారానికి ఒకరోజు డ్రై డే పాటించి నీటి నిల్వలను పూర్తిగా తొలగించాలని సూచించారు. గ్రామంలో పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపరిచేందుకు ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు. దోమల నివారణ చర్యల్లో భాగంగా అవసరమైన సూచనలు, అవగాహన కల్పిస్తూ ఆరోగ్య సిబ్బంది గ్రామంలో పర్యటించారు.

## గ్రామాభివృద్ధికి సహకరించండి...ఉమా సంజీవరెడ్డి



ప్రజాపక్షం/రామాయంపేట:గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఆర్.వెంకటాపూర్ సర్పంచు వెంకగారి ఉమా సంజీవరెడ్డి కోరారు. శుక్రవారం గ్రామంలో గ్రామ సభ ఏర్పాటు చేసిన సందర్భంగా ప్రజల అవసరాల కోసం చేపట్టాల్సిన పనుల గురించి చర్చించారు. పశుపోషణపై ఆధారపడుతున్న రైతులు, పాడి రైతులకు ఉపయోగకరంగా గేదెలకు షెడ్లు మంజూరు చేయాలని సభలో తీర్మానించారు. ఈ సందర్భంగా సర్పంచు మాట్లాడుతూ పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. గ్రామ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రజల భాగస్వామ్యంతో పారిశుద్య కార్యక్రమాలను చేపట్టాలన్నారు. రైతుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా పంట పొలాలకు మట్టి రోడ్డు ఏర్పాటు చేయాలని, వ్యవసాయ పనుల సమయంలో రైతులు, కూలీలు పొలాలకు చేరుకోవడంతో పాటు పంటలను తరలించేందుకు రహదారి సౌకర్యం ఏర్పాటుకు గ్రామసభలో తీర్మానించడం జరిగిందన్నారు.

## వృద్ధాశ్రమాన్ని సందర్శించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి : సీనియర్ సివిల్ జడ్జీ బి.సౌజన్య



ప్రజాపక్షం /సంగారెడ్డి: : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ,సీనియర్ సివిల్ జడ్జీ బి . సౌజన్య శుక్రవారం అమీన్ పూర్‌లోని శ్రీవాణి నగర్‌లో ఉన్న నెస్ట్ వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వృద్ధా శ్రమంలోని వృద్ధులతో ఆమె ఆప్యాయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధాశ్రమంలో వారికి అందుతున్న వసతులు ఆహారం వైద్య సదుపాయాలు పరిశుభ్రత, భద్రత తదితర అంశాలను పరిశీలించారు. వృద్ధాశ్రమంలో నివసిస్తూన్న వృద్ధుల అవసరాలు సమస్యలను అడిగి తెలుసుకొని వారికి అవసరమైన న్యాయపరమైన సహాయం ,ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించారు. వృద్ధుల హక్కుల పరిరక్షణకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందుబాటులో ఉంటుందని తెలిపారు. వృద్ధులను గౌరవించడం వారి పట్ల ప్రేమాభిమానాలతో వ్యవహరించడం ప్రతి ఒక్కరి బాధ్యతనిఐ ఆమె పేర్కొన్నారు. వృద్ధులు తమకు ఎదురయ్యే ఏవైనా న్యాయపరమైన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని అవసరమైతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. అలాగే వృద్ధాశ్రమంలో వృద్ధులకు అందుతున్న సేవలను నిరంతరం పర్యవేక్షిస్తు వారి సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమం నిర్వాహకులు సిబ్బంది ఇతరులు పాల్గొన్నారు.

## హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ముందంజ



ప్రజాపక్షం/చేర్యాల: 10 ఏళ్ల కాలంలో కెసిఆర్ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చినప్పటికీ ఎన్ని కష్టాలు ఎదురైనా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటిని కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ చేర్యాల మండల అధ్యక్షులు మంజె మల్లేశం అన్నారు. చేర్యాల మండలం కొత్తదొమ్మాటలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ కమీటిని మండల అధ్యక్షులు మంజె మల్లేశం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామశాఖ అధ్యక్షులుగా కర్రె నర్సింహులు, గౌరవ అధ్యక్షులుగా రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా కిషోర్, ప్రధాన కార్యదర్శిగా పరుశురాములు, కార్యదర్శిగా తాండ్ర సంపత్ ఎన్నికైనారు. నూతన కమీటీ సభ్యులను నాయకులు అభినందించారు.

## మానవత్వం చాటుకున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు



ప్రజాపక్షం/చేర్యాల:చేర్యాల మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన బోడపట్ల రాజు అనే వ్యక్తి ఆకునూర్ గ్రామంలో తన మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. రోడ్డుపై ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ధల్మిట్ట ఎంపీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు, ఆకునూరు గ్రామానికి చెందిన సంపత్‌కు ఆ మొబైల్ ఫోన్ దొరకడంతో, ఫోన్ లోని కాంటాక్ట్ నెంబర్లతో బాధితునికి సమాచారం అందించి, శుక్రవారం ఫోన్ అందజేసి మానవత్వం చాటుకున్నారు. బాధితుడు రాజు, ధూలమిట్ట ప్రభుత్వ ఉపాధ్యాయుడు సంపత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## నిమజ్జనాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ



ప్రజాపక్షం /సంగారెడ్డి: జిల్లా వ్యాప్తంగా వినాయక నిమజ్జనాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. గణనాథుని నిమజ్జనాల జరగనున్న సంగారెడ్డి మహబూబ్‌సాగర్ ,సదాశివపేట ,ఊట చెరువులను జిల్లా ఎస్పీ సందర్శించి భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. శోభయాత్ర మార్గాల్లో రోడ్ల పరిస్థితి ,మరమ్మతులు,నిమజ్జన ప్రాంతాల్లో బారికేడింగ్ లైటింగ్ పారిశుద్ధ్య ఏర్పాట్ల పై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా వినాయక శోభాయాత్రలు , నిమజ్జనాలు శాంతి యుత వాతావరణంలో జరిగేలా పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. సంగారెడ్డి మహబూబ్ సాగర్ చెరువు సదాశివపేట, ఊట చెరువులను జిల్లా ఎస్పీ సందర్శించి నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి ఎస్పీ తక్షణ సహాయం

ప్రజాపక్షం /సంగారెడ్డి: గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా సదాశివపేట లోని ఊట చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలించేందుకు వెళ్లిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మధ్యాహ్నం అందాజ 1.15 గంటల సమయంలో సదాశివపేట మండల పరిధిలోని నందికంది గ్రామ సమీపంలో జాతీయ రహదారి 65 పై రోడ్డు ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న ఎస్పీ వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్నారు. ప్రమాదంలో గాయపడిన క్షతగ్రాతులకు జిల్లా ఎస్పీ తక్షణ సహాయం అందించి సిబ్బంది స్థానిక ప్రజల సహకారంతో పోలీసు వాహనం ,అంబులెన్స్ ద్వారా వారిని చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరిలించేలా చర్యలు తీసుకున్నారు.

**గాయపడిన వారి వివరాలు,**

1. శివలీల భర్త మల్లేశం నివాసం కంది గ్రామం ,మండలం
2. బి. సంతోష్ వృత్తి ఆటో డ్రైవర్ నివాసం ఉత్తర్పల్లి గ్రామం కొండాపూర్ మండలం
3. ఎస్ అమర్ నివాసం బీదర్ జిల్లా బైక్ రైడర్

ఈ సంఘటనలో జిల్లా ఎస్పీ వెంట అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, డిఎస్పీ సత్యయ్య గౌడ్, ఇన్స్పెక్టర్ వెంకటేష్, తదితర పోలీసు అధికారులు సిబ్బంది ఉన్నారు.

## స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ..



**ప్రజాపక్షం/శివ్వంపేట :** మండలంలోని కొత్తపేట గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరైన స్మార్ట్ రేషన్‌కార్డులను అబ్దిదారులకు శుక్రవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ నింగనబోయిన రాములు చేతులమీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామానిఇ మంజూరైన 500 స్మార్ట్ రేషన్‌ఆర్డులను పంపిణీ చేయడం జరిగిందని, గ్రామాభివృద్ధికి మరింత కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చంద్రశేఖర్‌గౌడ్, వార్డు సభ్యులు సార మంజుల, ప్రభాకర్, ఆంజనేయులు, భరత్‌రెడ్డి, కార్యదర్శి శివకుమార్ తదితరులు ఉన్నారు.

## ఫ్లెమింగ్ కంపెనీ యాజమాన్యం సేవలు భేష్..



**ప్రజాపక్షం/శివ్వంపేట :** ఫశ్లీమింగ్ కంపెనీ యాజమాన్యం సేవలు అభినందనీయమని ంచడి గ్రామ సర్పంచ్ ప్రవీణ్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని చండి గ్రామపంచాయతీకి ఫ్లెమింగ్ ల్యాబరేటరీస్ కంపెనీ యాజమాన్యం వైకుంఠరథాన్ని శుక్రవారం అందజేశారు. మాజీ జడ్పీటీసీ పబ్బమహేశ్‌గుప్తా సహకారంతో ఫ్లెమింగ్ కంపెనీ యాజమాన్యం వైకుంఠరథాన్ని అందజేయడం జరిగిందని తెలిపారు. ఫ్లెమింగ్ కంపెనీ ఎండి ప్రకాశ్ ఆధ్వర్యంలో కే.మనోహర్, హెచ్ రాజేంద్రప్రప్రసాద్, ఎస్‌కే రీముల్ల అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. గ్రామప్రజలందరి తరుపున ఫ్లెమింగ్ కంపెనీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో శివ్వంపేట సర్పంచ్ వెంకటేశ్వర్, మాజీ సర్పంచ్ సంజీవచారి, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్‌రావు, నాయకులు అంతిరెడ్డిగారి అంజిరెడ్డి, వారాల ఆంజనేయులు, కములయ్యగారి నర్సింలు, ఏనుగు కృష్ణారెడ్డి, ఏనుగు బాల్‌రెడ్డి, వారాల సత్యం తదితరులు ఉన్నారు.

## పోక్సో కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు



**ప్రజాపక్షం / మెదక్ :** బాలికను వెంటాడుతూ బెదిరింపులకు పాల్పడిన పోక్సో కేసులో నిందితుడికి ప్రత్యేక పోక్సో కోర్టు రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. మెదక్ పట్టణానికి చెందిన రాహుల్ 17 ఏళ్ల బాలికను వెంటాడుతూ, బెదిరింపులకు పాల్పడినట్లు కేసు నమోదైంది. 2022 అక్టోబర్‌లో అప్పటి మెదక్ టౌన్ సీఐ మధు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, ఎస్ఐ మల్లారెడ్డి ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. పోలీసుల సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆర్.ఎం. సుభావాలి నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ శిక్ష విధించారు. బాలికలు, మహిళలను వేధించడం, వెంటాడడం, బెదిరించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. కేసులో సమర్థవంతంగా పనిచేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించారు.

## హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/కొండపాక :** మండల పరిధిలోని గ్రామాలలో రైస్ మిల్లులలో బజార్లలో సిమెంటు స్టీల్ గ్రామీణ ప్రాంతాలలో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు సామాజిక భద్రత పని భద్రత ఆరోగ్య రక్షణ కల్పించాలని సిఐటియు ఉపాధ్యక్షులు అమ్ముల బాల నర్సయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం రోజున వెలికట్ట చౌరస్తా వద్ద హమాలి వర్కర్స్ యూనియన్ (సిఐటియు) సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా బాల్ నర్సయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో పనిచేస్తున్న హమాలి కార్మికులు తీవ్రమైన ఆర్థిక, సామాజిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. సమాజంలో ప్రజలకు సరుకులు అందించడంలో హమాలీలు కీలకపాత్ర పోషిస్తున్నారని ఎగుమతులు దిగుమతులు సమయానికీ ప్రజల అవసరాలను తీర్చే విధంగా ముందుంటున్నారని అన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగినప్పటికీ హమాలిల కూలీ రేట్లు పెరగడం లేదని పని భద్రత, సామాజిక భద్రత, ఆరోగ్య రక్షణ, సంక్షేమ సౌకర్యాలు లేక వందలాది మంది హమాలీ కార్మికుల పరిస్థితి దుర్భరంగా మారిందన్నారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ 2023 అసెంబ్లీ ఎన్నికల మేనిఫస్టోలో హమాలీ కార్మికుల కోసం ప్రత్యేకంగా వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేస్తామని, హమాలి కార్మికులందరికీ హెల్త్ కార్డులు అందజేస్తామని, హామీ ఇచ్చిందని ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినప్పటికీ ఏ ఒక్క హామీ నేటికీ అమలుకు నోర్చుకోలేదని మండిపడ్డారు.

## ప్రాచీన హస్త ప్రతుల గుర్తింపునకు సర్వే

**ప్రజాపక్షం / మెదక్ :** జ్ఞాన్ భారత్ మిషన్‌లో భాగంగా మెదక్ జిల్లాలోని ప్రాచీన హస్తప్రతులు, తాటిఆకు గ్రంథాలు, చారిత్రక పత్రాల గుర్తింపు, సర్వే, డిజిటలైజేషన్ చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. ఇందుకోసం అదనపు కలెక్టర్ నగేష్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 75 ఏళ్లకు పైబడిన పురాతన హస్తప్రతులు, పత్రాలను దేవాలయాలు, మఠాలు, విద్యాసంస్థలు, గ్రంథాలయాలు, మ్యూజియంలు, పరిశోధకులు, ప్రైవేట్ వ్యక్తులు స్వచ్ఛందంగా నమోదు చేసుకోవచ్చన్నారు. అసలు ప్రతులు యజమానుల వద్దే ఉంటాయని, వాటిని శాస్త్రీయంగా సంరక్షించి డిజిటల్ కాపీలను నేషనల్ డిజిటల్ రిపాజిటరీలో భద్రపరుస్తామని తెలిపారు. ప్రజలు, పండితులు, స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. వివరాలకు నోడల్ అధికారి, యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్ (8309507937)ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

## జాతీయ రహదారిపై అదుపుతప్పిన ట్రక్



**ప్రజాపక్షం/మనోహరాబాద్:** మనోహరాబాద్ మండల పరిధిలోని ముప్పిరెడ్డిపల్లి శివారులో 44వ జాతీయ రహదారిపై శుక్రవారం ఐటీసీ పరిశ్రమకు చెందిన ట్రక్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది. రోడ్డుపై వెళ్తున్న సమయంలో ట్రక్ అదుపుతప్పడంతో ఒక్కసారిగా బోల్తా పడినట్లు సమాచారం. ప్రమాదం జరిగిన సమయంలో సమీపంలో వాహనాలు, ప్రయాణికులు ఉండటంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు.అయితే అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణాపాయం సంభవించలేదు. ప్రమాదంతో ట్రక్ రహదారి పక్కకు ఒరిగి ఉండటంతో కొంతసేపు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ట్రక్‌ను పక్కకు తరలించి రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

## గొంతు తడుపుకునేందుకు వెళ్లి తిరిగిరాని లోకాలకు



**ప్రజాపక్షం/పాపన్నపేట :** గొంతు తడుపుకునేందుకు వెళ్లి ప్రమాద వశత్తు బోరు బావి పై పడి విద్యుత్ షాక్ గురై మహిళ మృతి చెందిన సంఘటన చికోడులో శుక్రవారం వెలుగు చూసింది. పోలీసులు, కుటింబికుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.బద్దం శోభరాణి (51)వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గురువారం తమ వ్యవసాయ క్షేత్రంలో పనులు చేపట్టేందుకు వెళ్ళి పొద్దాస్తమానం పని చేస్తూ అలిసిపోయి గొంతు తడుపు కునేందుకు త్రాగు నీటి కోసం ప్రక్కనే ఉన్న మరొకరి వ్యవసాయ క్షేత్రంలోని బోరుబావి వద్దకు చేరుకొని నీరు త్రాగెందుకు వెళ్ళి ప్రమాద వశత్తు బోరు బావి పై పడడంతో విద్యుత్ షాక్ కు గురై మృతి చెందినట్లు తెలిపారు. ఈ విషయం గమనించిన స్థానికులు వెంటనే కుటింబికులకు సమాచారం అందివ్వడం తో కుటింబికులు వెళ్ళి వెంటనే పాపన్నపేట పోలీసులకు సమాచారం అందివ్వడం తో పాపన్నపేట ఎస్ ఐ శ్రీనివాస్ గౌడ్, సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించి మృతురాలు కుమారుడు సంపత్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా మృతురాలికి ఒక కుమారుడు సంపత్ రెడ్డి ఉన్నారు.

## రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ధూల్మిట్ట విద్యార్థులు



**ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట :** సిద్ధిపేట జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా సాఫ్ట్ బాల్ టోర్నమెంట్ మరియు సెలెక్షన్ లలో ధూల్మిట్ట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ జిల్లా సెలెక్షన్ మరియు పోటీలలో ధూల్మిట్ట పాఠశాల బాలికల విభాగంలో కొండూరి భావన, సుమేర, మేఘన, హర్షిని (అర్హత సాధించినట్లు) ఎంపికయ్యరని ధూల్మిట్ట పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనుముల కర్ణాకర్‌రెడ్డి, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వెగ్గలం సతీష్‌కుమార్‌లు తెలిపారు. రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు ఈ నెల 19తేది నుండి (నేటి నుండి) నిజామబాద్ జిల్లా కమ్మరపల్లిలో నిర్వహించనున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ వెగ్గలం సతీష్‌కుమార్ తెలిపారు. చదువుతో పాటుగా ఆటల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభను కనబరుస్తున్నా పాఠశాల విద్యార్థులను, ప్రోత్సహించి ఉత్తమమైన శిక్షనలతో ముందకు తీసుకపోతున్న ఫిజికల్ డైరెక్టర్ వెగ్గలం సతీష్‌కుమార్‌ను, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనుముల కర్ణాకర్‌రెడ్డిలను గ్రామ సర్పంచ్ గునుకుల లీలా జగన్ మోహన్ రెడ్డి, పాఠశాల విద్యార్థి తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన



**ప్రజా పక్షం/పెద్ద శంకరం–పేట:** పెద్ద శంకరంపేట మండల పరిధిలోని ముసాపేట గ్రామంలో ను హనుమాన్ మందిరం ధర్మశాల వద్ద ఏర్పాటు చేసిన గణపతి మంటపం లో అర్చకులు శివశ్రీ మాడపతి రాజ్ కుమార్ స్వామి ఆధ్వర్యంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రోడ్డుపై విరిగిన చెట్టు రాకపోకలకు అంతరాయం



**ప్రజాపక్షం/రేగోడుః** గోడ్‌లో ఈదురు గాలులతో కురిసిన వర్షానికి గురువారం రాత్రి రేగోడు కొండాపూర్ రహదారిపై భారీ వృక్షం పడిపోయింది. దీంతో రేగోడు అల్లా దుర్గం వెళ్లే వాహనాలు నిలిచిపోయాయి. శుక్రవారం ఉదయం చెట్టు రోడ్డుపై పడిపోయింది విషయం తెలుసుకొని కొండాపూర్ సర్పంచ్ పండరి ఆధ్వర్యంలో వృక్షం తొలగించారు

## మా సమస్యలు పట్టించుకోరా?



**ప్రజాపక్షం/రేగోడుః** గ్రామాల్లో నెలకొన్న సమస్యలు అధికారులు పట్టించుకోరా అంటూ సర్పంచులు ఆ వేదన వ్యక్తం చేశారు శుక్రవారం రేగోడు మండల పరిషత్ కార్యాలయంలో మండల సమావేశం నిర్వహించారు . రెవెన్యూ అధికారులు వ్యవసాయ భూములను నిషేధిత జాబితాలో ఏ రకంగా చేర్చారో అన్ని గ్రామపంచాయతీలో పెట్టాలని దోసపల్లి సర్పంచ్ అమరసింహారెడ్డి అన్నారు. స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయడం లేదని కొండాపూర్ సర్పంచ్ పండరి తెలిపారు. పెద్దతండ దోసపల్లి లలో విద్యుత్ స్తంభాలు మార్చాలని సర్పంచులు అమరసింహారెడి తెలిపారు కొండాపూర్ గ్రామంలో 25 కెవి ట్రాన్స్ఫార్మర్లు నిరుపయోగంగా ఉన్నాయని సర్పంచ్ పండరి తెలిపారు.

## అండర్‌పాస్‌లో నీటి నిల్వ



**ప్రజాపక్షం/మనోహరాబాద్ :** మనోహరాబాద్ మండలంలోని రామాయపల్లి వద్ద ఉన్న అండర్‌పాస్‌లో భారీగా నీరు నిలిచిపోయింది. దీంతో అండర్‌పాస్ ద్వారా రాకపోకలు సాగించే స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.మనోహరాబాద్‌కొత్తపల్లి రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా 44వ జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మించారు. సమీప గ్రామాల ప్రజలు రాకపోకల కోసం అండర్‌పాస్‌ను వినియోగిస్తున్నారు. అయితే గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ప్రస్తుతం అండర్‌పాస్‌లో నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు తెలిపారు.

## మంజూరైన పింఛన్లను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యుసి ఎఇ



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండల పరిధిలోని కల్వకుంట గ్రామానికి చేయూత పెన్షన్ దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇళ్లల్లోకి శుక్రవారం ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి పెన్షన్లు పరిశీలన చేయడం జరిగింది .ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోష్ కుమార్, వెంకట్, శేఖర్ పాల్గొన్నారు.

# అన్ఫిట్ విధానాన్ని ఈ ప్రాంత ఏరియా హాస్పిటల్ లో ఏర్పాటు చేయాలి

**ప్రజాపక్షం/భూపాలపల్లి** : సింగరేణి కార్మికులకు సంబంధించిన అన్ఫిట్ విధానాన్ని ప్రస్తుతం మెడికల్ బోర్డు పరీక్షల కోసం కార్మికులు కొత్తగూడెం వరకు వెళ్లాల్సి వస్తోందని, దీనివల్ల సమయం, ఆర్థిక భారం పెరుగుతోందని, అందువల్ల సింగరేణి ఉన్న ప్రాంతాల్లోని ఏరియా ఆసుపత్రులలోనే మెడికల్ బోర్డు పరీక్షలు నిర్వహించి, అన్ఫిట్ విధానాన్ని ప్రతినెలా క్రమం తప్పకుండా అమలు చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ శాసనసభ సమావేశాల్లో శుక్రవారం గండ్ర సత్యనారాయణ రావు సింగరేణి కార్మికులు, రిటైర్డ్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు, భూ నిర్వాసితులు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సింగరేణి సంస్థ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, విద్యుత్ ఉత్పత్తికి, వేలాది కుటుంబాల జీవనాధారానికి మూలస్తంభంగా నిలుస్తోందని పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమమే సంస్థ అభివృద్ధికి బలమైన పునాది అని అన్నారు.సింగరేణి సంస్థలో అధికారులకు అమలు చేస్తున్న వివిధ అలవెన్సులు, ఇతర ప్రయోజనాలను కార్మికులకు కూడా



సమానంగా వర్తింపజేయాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. సంస్థ అభివృద్ధిలో అధికారులతో పాటు కార్మికుల పాత్ర కూడా సమానంగా ఉంటుందని, అందువల్ల సంక్షేమ పథకాల అమలులో వివక్షకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా ఇన్కమ్ టాక్స్ కోల్ ఇండియా ఉద్యోగులకు మాదిరిగానే కార్మికులకు కూడా చెల్లించాలని, రిటైర్డ్ సింగరేణి కార్మికుల వైద్య సమస్యలను ప్రస్తావిస్తూ, ప్రస్తుతం రిటైర్డ్ అధికారులకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స కోసం రూ.25 లక్షల వరకు వైద్య ఆర్థిక సహాయం అందిస్తుండగా, రిటైర్డ్ కార్మికులకు కేవలం రూ.8 లక్షల పరిమితి మాత్రమే ఉందని తెలిపారు. ఈ అసమానతను తొలగించి, రిటైర్డ్ కార్మికులకు కూడా రూ.25 లక్షల వరకు వైద్య సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. సింగరేణి కార్మికుల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రత్యేక గృహ స్థలాల పథకాన్ని ప్రవేశపెట్టి, ప్రతి అర్హ కార్మిక కుటుంబానికి కనీసం 250 చదరపు గజాల ఇంటి స్థలాన్ని కేటాయించాలని ఎమ్మెల్యే సూచించారు. ఎన్నో సంవత్సరాలుగా కష్టపడి పనిచేస్తున్న కార్మికులకు గౌరవప్రదమైన నివాస సౌకర్యం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. కార్మికుల సర్వీస్ రికార్డుల్లో ఉన్న మారుపేర్లు, పేర్ల వ్యత్యాసాలు, వారసత్వ సంబంధిత వివాదాలు, వాటికి సంబంధించిన పెండింగ్ కేసులు అనేక కుటుంబాలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని చెప్పారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుని, త్వరితగతిన కేసులను పరిష్కరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త లేబర్ కోడ్స్ అమలు వల్ల కార్మిక హక్కులు దెబ్బతినే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్రంలో కార్మిక ప్రయోజనాలకు భంగం కలిగించే విధంగా వాటిని అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# కుక్కలు కోతుల బారి నుండి రక్షించండి మహాప్రభో...



**ప్రజాపక్షం / వేలేరు** : హనుమకొండ జిల్లా వేలేరు మండలకేంద్రంతోపాటు వివిధ గ్రామాలలో కుక్కలు, కోతుల బెడద రోజు రోజుకూ పెరుగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీధుల్లో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు, చిన్నారులు, ద్విచక్ర వాహనదారులను వెంటాడుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మరోవైపు కోతుల గుంపులు ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడంతో పాటు ఇంటి పైకప్పులు, పరిసరాల్లో హల్ చల్ చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు,కోతుల బెడదతో పంటలు, కూరగాయలు, పండ్ల తోటలకు కూడా నష్టం వాటిల్లుతోందని చెబుతున్నారు. కుక్కలు, కోతుల నియంత్రణకు సంబంధించి ప్రజాప్రతినిధులు, అధికారులు, తక్షణ చర్యలు చేపట్టి ప్రజలకు రక్షణ కల్పించాలని మండలప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, భద్రత దృష్ట్యా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ కుక్కలు, కోతుల బెడద నుంచి రక్షించండి మహాప్రభో అంటూ ప్రజలు

# భక్తిశ్రద్ధలతో మన గణపతి కుంకుమ పూజ



**ప్రజాపక్షం/నెక్కొండ:** మూసిన బజార్‌లోని మన గణపతి మండపంలో కుంకుమ పూజను మహిళా భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గణనాథుడికి ప్రత్యేక పూజలు చేసి, కుంకుమ పూజలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. భక్తి వాతావరణంలో అంగరంగ వైభవంగా జరిగిన పూజా కార్యక్రమంలో మహిళా భక్తులు ఉత్సాహంగా పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమాన్ని మన గణపతి

# 22ఏలో ఉందని కేటీఆర్, హరీష్‌రావు దుష్ప్రచారం చేస్తున్నారు

**ప్రజాపక్షం /సంగారెడ్డి:** కేసీఆర్ ఆదేశాల మేరకు కేటీఆర్ హరీష్‌రావు 22ఏ జాబితా విషయంలో దుష్ప్రచారం సాగిస్తున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం అన్నారు. బిఆర్‌ఎస్ హయంలో ధరణి తీసుకొచ్చి ఏకంగా 22.93 లక్షల ఎకరాలు 22(ఎ) లో పెట్టిన వాళ్లే ఇప్పుడు అవాహకులు చవాకులు పేలుతున్నారని విమర్శించారు. డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి తో కలిసి సంగారెడ్డిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిషేదిత జాబితాలో ఉన్న భూముల విస్తీర్ణాన్ని 7 లక్షల ఎకరాలకు తగ్గించామని ఆయన వివరించారు. ప్రస్తుతం 22ఎ లో కేవలం 3.75 లక్షల ఎకరాల భూమి మాత్రమే ఉందన్నారు. ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు ముఖ్యమంత్రి రెడ్డి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. కేటీఆర్ హరీష్‌రావు మాత్రం ప్రజలను గందరగోళానికి గురిచేసేలా కోటి ఎకరాలు 22ఏలో ఉందని దుష్ప్రచారం సాగిస్తున్నారని ఆయన మండిపడ్డారు.

**బీఆర్‌ఎస్ నేతలు దోచుకున్న భూముల వివరాలను బయట పెడుతాం**

తొమ్మిది ఏళ్ల పాలనలో అడ్డగోలుగా పట్టాలు సృష్టించి బిఆర్‌ఎస్ నేతలు దోచుకున్న భూముల వివరాలన్నింటిని భయట పెడతామని ఈ సందర్భంగా టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం వెల్లడించారు. కేసీఆర్ పాలనలో అన్ని వర్గాలకు అన్యాయమే జరిగిందన్నారు. బిల్లులు రాక ఎంతో మంది సర్పంచులు ఆత్మహత్యకు పాల్పడ్డారని గుర్తు చేశారు. లక్ష కోట్లు ఖర్చు చేసి కాళేశ్వరం కట్టిన బిఆర్‌ఎస్ నేతలు, రాష్ట్రాన్ని



దివాలా తీయించారన్నారు. అప్పుల బారం ఉన్నప్పటికి కాంగ్రెస్ ప్రజా పాలనలో హామీలన్నింటిని నేరవేరుస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. హైదరాబాదు నగరాన్ని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చి దిద్దేదందుకు ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి అనుక్షణం తపిస్తున్నారని అన్నారు.

**ధళితులను అవమానించిన బీఆర్‌ఎస్ నేతలు :**

షామ్ హౌస్ ముందు డప్పు కొట్టిన దళితులను అవమానించేలా ఆ రోడ్డను పసుపు నీళ్లతో శుద్ది చేశారని ఆయన అన్నారు. స్వీకర్ను అవమానించేలా అనుచిత వ్యాక్యాలు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

**ప్రజాపాలనలో అన్ని వర్గాలకు న్యాయం**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఈ 30 నెలల్లో ఇచ్చిన ,ఇవ్వని హామీలను నెరవేరుస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నో కొత్త పాలసీలు, తెచ్చి అభివృద్ది సంక్షేమాన్ని కొనసాగిస్తున్నారని వివరించారు. బీఆర్ఎస్ పార్టీతో లో పాయికారి ఒప్పందం చేసుకొని ఎంపీగా రఘునందన్‌రావు కాంగ్రెస్ బీఆర్ఎస్ ఒక్కటి అని మట్లాడటం విడ్డూరంగా ఉందని విలేఖరులు అడిగిన ప్రశ్నలకు సత్యం శ్రీరంగం సమాదానం ఇచ్చారు. బీఆర్ఎస్ పార్టీతో బీజేపి లోపాయికారి ఒప్పందం చేసుకోవడం వల్లనే ఎనిమిది మంది బీజేపి ఎంపీలు గెలిచారని అన్నారు.

# ఘనంగా విశ్వకర్మ జయంతి ఉత్సవాలు

**ప్రజాపక్షం/హసన్ పర్తి:** శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం లో విశ్వకర్మ జయంతి ఉత్సవాలు విశ్వ బ్రాహ్మణ సంఘం ఎల్లాపూర్ గ్రామ అధ్యక్షులు శ్రీపెల్లి ప్రవీణ్ కుమార్( పులి) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.శుక్రవారం హసన్ పర్తి మండల పరిధిలోని ఎల్లాపూర్ గ్రామం వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో సంఘం అధ్యక్షులు శ్రీ పెల్లి ప్రవీణ్ కుమార్ (పులి)విశ్వకర్మ భగవాన్ చిత్రపటానికి పూలమాలలు ఘనంగా నివాళులర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశ్వధర్మం అనేది మానవులందరిని ఏకం చేసే సత్యం, ధర్మం, ప్రేమ, మానవత్వం, సమానత్వం పరస్పర గౌరవం వంటి ఉన్నతమైన విలువలకు ప్రతికని పేర్కొన్నారు.కుల, మత, ప్రాంత భాష, భేదాలకు అతీతంగా ప్రతి మనిషిని గౌరవించడం సమాజంలో శాంతి సౌభ్రాతృత్వం, ఐక్యత పెంపొందించడం విశ్వ ధర్మము యొక్క ప్రధాన లక్ష్యమని తెలిపారు. అలాగే ప్రకృతిని గౌరవించడం వృత్తులు నైపుణ్యాలను కాపాడుకోవడం శ్రమకు గౌరవం ఇవ్వడం ధర్మబద్ధమైన జీవన విధానాన్ని పాటించడం ద్వారా సమాజ అభ్యున్నతికి ప్రతి



ఒక్కరూ తన వంతుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. విశ్వకర్మ భగవానుడు స్ఫూర్తితో కళలు వృత్తులు శిల్ప సంప్రదాయాలకు భావితరాలకు అందించడంలో పాటు యువత విద్య నైపుణ్య అభివృద్ధి వైపుకు ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు వెలిశోజు శ్రీరామ్ , ప్రధాన కార్యదర్శి వెలిశోజు బుచ్చయ్య చారి, సహాయక కార్యదర్శి వెలుపోజు సునీల్ చారి, కోశాధికారి కొడార్ల శ్రీనివాస్ రాజయ్య చారి, వెంకటేశ్వర చారి, లింగమూర్తి శ్రీనివాస్ సత్తి , రవీంద్ర చారి, పాడి రామకృష్ణా రెడ్డి, నేదునూరి సునీల్, గంగిళ్ళ వెంకట్ రెడ్డి,కలవచర్ల సుదర్శన్, బుచ్చి రాములు,జగన్ గ్రామస్తులు విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు పాల్గొనడం జరిగింది.

# సిఐ ఫణిధర్‌కు దళిత సంఘాల అభినందనలు



**ప్రజాపక్షం/నెక్కొండ:** నెక్కొండ పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన సిఐ ఫణిధర్‌ను దళిత ప్రజా సంఘాలు, అంబేద్కర్ సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి పరిచయం చేసుకున్నారు. అనంతరం శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను ఉద్దేశించి అభ్యంతరకరంగా ఉన్నట్లు పేర్కొంటున్న అంశాలపై హమారా ప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిఐకి వినతిపత్రం అందజేశారు. ఫిర్యాదును పరిశీలించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత ప్రజా సంఘాలు, అంబేద్కర్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# గణనాథుని సన్నిధిలో అన్నదానం




**ప్రజాపక్షం/నెక్కొండ:** నెక్కొండ ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గోరంటాల రాధారాణి వెంకటనారాయణ దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. వినాయకుడి సన్నిధిలో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తూ సేవాభావాన్ని చాటుకున్నారు. గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. అన్నదానంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.

# విఘ్నేశ్వరుని పూజా కార్యక్రమాలు



**ప్రజాపక్షం/ నర్సంపేట :** నర్సంపేట పట్టణం 10వ వార్డులోని పోచమ్మ ఆలయంలో పోచమ్మ తల్లి యువ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుని మండపం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 10వ వార్డు మాజీ కౌన్సిలర్ నాగిశెట్టి పద్మ ప్రసాద్ హాజరై విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, విఘ్నేశ్వరుని ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో నాగిశెట్టి ప్రవీణ్, ప్రణీత, వలస సత్యనారాయణ, శారద, తాళ్లపల్లి కళ్యాణి, హన్మకొండ మరియా, అరపెల్లి వైడూర్యం, అంజలి, బొల్ల సుమ, పున్నం శిరీష, సుజాత, కొలువుల లలిత, వసంత, మౌనిక, మామిడాల సరోజన, విజయ, పాముసూరి సరూప, గద్దె కోటేశ్వరమ్మ, రాయిడి శిరీష, జ్యోతి, శ్రీరామోజు రమ్య, కందికొండ సునిత, రావుల లక్ష్మి , అల్లి నీరజ, అవుల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# 25 వరకు డిజిటల్ పంట నమోదు సర్వే

ప్రజాపక్షం/నడికూడ : నడికూడ మండల పరిధిలోని అన్ని గ్రామాలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వాలంటీర్ల సహకారంతో డిజిటల్ పంట నమోదు సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి,ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి డిజిటల్ రూపంలో పంట నమోదు చేస్తున్నారు.ఈ డిజిటల్ పంట సర్వేలో భాగంగా గ్రామాల్లోని రైతుల పొలాలను వాలంటీర్లు క్షేత్రస్థాయిలో సందర్శించి పంట పేరు,పంట రకం,సాగు విస్తీర్ణం, పంట పరిస్థితి,సాగు చేసిన పొలం వివరాలు తదితర సమాచారాన్ని నమోదు చేస్తున్నారు.ప్రతి రైతు పంట నమోదు ప్రక్రియను బాధ్యతగా నమోదు చేయించుకోవాలని రైతులు తమ పొలాల్లో సాగు చేస్తున్న పంటకు సంబంధించిన సరైన,వాస్తవ వివరాలను సంబంధించిన గ్రామ వాలంటీర్లకు అందించి డిజిటల్ పంట సర్వేకు పూర్తి స్థాయిలో సహకరించాలని మండల వ్యవసాయ అధికారి కోరారు.రాబోయే పంట కొనుగోలు సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు ప్రతి రైతు తన పొలంలో సాగు చేస్తున్న పంటను తప్పనిసరిగా డిజిటల్ పంట సర్వేలో నమోదు చేయించుకోవాలని సూచించారు.పంట సాగు చేసినప్పటికీ డిజిటల్ నమోదులో పంట వివరాలు లేకపోతే,పంట విక్రయ సమయంలో ఇబ్బందులు



తలెత్తే అవకాశం ఉన్నందున రైతులు నిర్లక్ష్యం చేయకుండా పంట నమోదు పూర్తయ్యేలా సహకరించాలని కోరారు. ఈనెల 25వ తారీకు వరకు తమ పంట వివరాలను సకాలంలో, సక్రమంగా డిజిటల్‌గా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి పోరిక జైసింగ్ విజ్ఞప్తి చేశారు.

## అదనపు కలెక్టర్‌ను కలిసిన రేషన్ డీలర్లు

ప్రజాపక్షం/ఖిలా వరంగల్ : జిల్లాకు నూతనంగా నియమితులైన అదనపు కలెక్టర్(రెవెన్యూ) కిశోర్‌ను రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ప్రతినిధులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా అధ్యక్షుడు మోహన్‌నాయక్ ఆధ్వర్యంలో కిశోర్‌ను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చెట్టుపల్లి దామోదర్, వరంగల్ మండల అధ్యక్షుడు గజ్జి గోవర్ధన్, ఖిలా వరంగల్ మండల అధ్యక్షుడు మంద రామచంద్రం, నెక్కొండ మండల అధ్యక్షుడు గోరంట్ల వెంకటనారాయణ, కార్యదర్శులు మహేందర్, రాజేందర్, సింగ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులు, నవజాత శిశువుల కోసం ప్రత్యేక వైద్య శిబిరం




ప్రజాపక్షం /హనుమకొండ టౌన్ : వరంగల్ ఉమ్మడి జిల్లా చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు, ముఖ్యంగా చిన్న పిల్లల తల్లిదండ్రుల కోసం ఒక అద్భుతమైన అవకాశం అందుబాటులోకి వచ్చిందని హైటెక్ సిటీ యశోద హాస్పిటల్స్ వైద్యులు జి. ప్రవీణ్ కుమార్, కన్సల్టెంటెంటి నియోనాటాలజిస్ట్, డాక్టర్ శతాబ్ది గిరి కార్డియాలజిస్ట్ తెలిపారు. నవజాత శిశువులు, చిన్నారుల ఆరోగ్య సమస్యల నివారణార్థం ప్రత్యేక వైద్య నిపుణుల సేవలను అందించనున్నట్లు వారు వెల్లడించారు. ప్రతి నెల మూడవ గురువారం రోజున హనుమకొండ లో హైటెక్ సిటీ యశోద హాస్పిటల్ వైద్యులు కన్సల్టెంట్ నియోనాటాలజిస్ట్, జి. ప్రవీణ్ కుమార్, కన్సల్టెంట్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్, డాక్టర్ శతాబ్ది గిరి వైద్యులు అందుబాటులో ఉంటారని, సెల్ నెంబర్లను 9618328673, 9247565105 సంప్రదించాలని తెలిపారు. నవజాత శిశువుల సమస్యలు, నెలలు నిండకుండా పుట్టడం ప్రీమెచ్యూరిటీ, పుట్టుకతో వచ్చే శ్వాసకోశ సమస్యలు, తక్కువ బరువుతో జన్మించిన శిశువుల సంరక్షణపై ప్రత్యేక వైద్య సలహాలు, పిల్లల గుండె సంబంధిత సమస్యలు, చిన్నారుల్లో పుట్టుకతో వచ్చే గుండె లోపాలు, ఇతర కార్డియాక్ సమస్యల నిర్ధారణ, నిపుణులైన కార్డియాలజిస్ట్ చేత వైద్య సేవలు పొందవచ్చునని వారు తెలిపారు. వరంగల్, హనుమకొండ పరిసర ప్రాంతాల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని, తమ పిల్లల ఆరోగ్య భద్రతకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు కోరారు. ఈ విలేకరుల సమావేశంలో హైటెక్ సిటీ యశోద హాస్పిటల్ సిబ్బంది వికె రెడ్డి, చంద్రకాంత్, మహేష్, విజయ్, అనుదీప్ పాల్గొన్నారు.

## వర్ధన్నపేట ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులు వెంటనే ప్రారంభించాలి

ప్రజాపక్షం/వర్ధన్నపేట : వర్ధన్నపేట నియోజకవర్గానికి మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులు ఇంతవరకు ప్రారంభం కాకపోవడంపై వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కే.ఆర్. నాగరాజు అసెంబ్లీలో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు.ఈ పాఠశాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.200 కోట్ల మేర పరిపాలనా అనుమతులు మంజూరు చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఎదురుచూపులు నెలకొన్నాయని సభ దృష్టికి తీసుకెళ్లారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు ప్రభుత్వాన్ని కోరారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో విద్యా రంగానికి ప్రాధాన్యతనిస్తూ, పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించేందుకు ఇంటిగ్రేటెడ్ స్కూల్ కీలకంగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో ఉచిత బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనం ప్రవేశ పెట్టడం అభినందనీయం,ముఖ్యంగా గర్ల్స్ హాస్టళ్లలో భవన నిర్మాణాలు కాంపౌండ్ వాల్స్ ఇతర మౌలిక వసతులతో పాటు రాత్రి వేళలు కూడా సెక్యూరిటీ సిబ్బందిలను ఏర్పాటు చేయాలని సభలో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు.

# ఉర్సు చెరువు ప్రాంతాన్ని టాంక్ బండ్‌గా తీర్చిదిద్దాలి

తెలంగాణ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ సంఘం విజ్ఞప్తి



ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : చారిత్రాత్మక వరంగల్ మహా నగరంలో ఉన్న ఉర్సు చెరువు ముందు ప్రాంతాన్ని టాంక్ బండ్ మాదిరిగా మార్చి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్ది ప్రజలకు అందుబాటులోకి తేవాలని తెలంగాణ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ మాత్ర సంఘం ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదను కలిసి వినతి పత్రం సమర్పించి విజ్ఞప్తి చేశారు. ఈ అహ్లాదకర ప్రదేశంలో హైదరాబాద్ వంటి ప్రసిద్ధ నగరంలో ఉన్న ట్యాంక్ బండ్,ఉప్పల్ రామంతాపూర్ చెరువు ముందు ప్రాంతాలలో వివిధ సంఘ సంస్కర్తలైన మహనీయుల విగ్రహాలను నెలకొల్పిన నేపథ్యంలో పర్యాటకంగా ఏ విధంగా ఆ ప్రాంతాలు అభివృద్ధి సాధించాయో అదే విధంగా వరంగల్ మహా నగరంలో ఉన్న ఉర్సు చెరువు ముందు ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా చేసి మహనీయుల విగ్రహాలను నెలకొల్పి వారి స్ఫూర్తిని భావి తరాలకు అందించాలని కోరారు. మా జాతి ఆరాధ్య దైవం శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహాన్ని, మా జాతి ప్రముఖ వ్యక్తి, తెలంగాణ సిద్ధాంతకర్త దివంగత డాక్టర్ కొత్తపల్లి జయశంకర్ గారి విగ్రహాన్ని కూడా ఆ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో కోరారు. వినతి పత్రం అందించిన వారిలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు, రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షులు పెండోట సురేష్ కుమార్,వీణవంక సదానందం,రాష్ట్ర కార్యదర్శులు డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్,సిద్దోజు వీరన్న తదితరులు ఉన్నారు.

## హమార ప్రసాద్‌పై రాజ్యద్రోహం కేసు పెట్టి శిక్షించాలి

జనగామలో ఆయన దిష్టిబొమ్మ దహనం



ప్రజాపక్షం/జనగామ : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కల్పిత నాయకుడు అని పుస్తకాన్ని రాశాను దానిని విడుదల చేస్తానన్న మహార ప్రసాద్‌పై రాజ్య ద్రోహం కేసు పెట్టి కఠినంగా శిక్షించాలని కరెన్సీపై అంబేద్కర్ ఫోటో సాధన సమితి జాతీయ అధ్యక్షులు డాక్టర్ జేరిపోతుల పరశురామ్ డిమాండ్ చేశారు. కెన్సీపై అంబేద్కర్ ఫోటో సాధన సమిగి ఆధ్వర్యంలో శుక్రవారం జనగామలో హమార ప్రసాద్ దిష్టిబొమ్మకు చెప్పుల దండ వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పరశురామ్ మాట్లాడుతూ గతంలో అంబేద్కర్ బడికి ఉంటే ఎన్‌కౌంటర్ చేసేవాడినని, అంబేద్కర్ విగ్రహాలను చూస్తుంటే అసహ్యం వేస్తుందని, ఎందుకు విగ్రహాలు పెట్టారో అర్థం కావడం లేదంటు తన సొంత కవిత్వంతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారన్నారు. హమార ప్రసాద్ వ్యాఖ్యలపై దళిత బహుజన, అంబేద్కర్ సంఘాలు, పౌర సమాజం మేల్కొని ఇంటి దేశ విద్రోహ శక్తులను తరిమి కొట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కరెన్సీపై అంబేద్కర్ ఫోటో సాధన సమితి జాతీయ సలహాదారులు మల్లిగారి రాజు, బక్క సునిల్, మచ్చ కుమార్, తాళ్లపల్లి ఎల్లేష్, రొడ్డ కృష్ణ, గండి చంద్రశేఖర్, మౌనిక పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల వేగం పెంచాలి

ప్రజాపక్షం/పాలకుర్తి: నిలవ నీడలేని నిరుపేదల కోసం మంజూరి చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలని జనగామ జెడ్పీ సీఈవో బలరాం అన్నారు. శుక్రవారం మండలంలోని పాలకుర్తి, పెద్దతండా (బీ) గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఎలాంటి జాప్యం లేకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ దశలలో ఉన్న ఇళ్ల పనులను ప్రారంభించి నిర్మాణం చురుగ్గా జరిగేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో వేదవతి, పంచాయితి కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ తిరుపతి ఉన్నారు.

## గణనాథుని సన్నిధిలో కుంకుమ పూజ

ప్రజాపక్షం/జఫర్‌గఢ్: మండల కేంద్రంలో ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించబడిన గణనాయకుడిని ఆర్యవైశ్య మహిళలు కుంకుమ పూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం మహిళలు పెద్ద ఎత్తున మంగళహారతులతో ఆర్యవైశ్య సంఘానికి తరలివచ్చి సాంప్రదాయక పూజా కార్యక్రమంలో అత్యంత ముఖ్యమైన కుంకుమ పూజను నిర్వహించారు. కుంకుమను అమ్మవారి స్వరూపంగా భావించి కుంకుమతో అర్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారి కృపతో వర్షాలు కురవాలని ప్రార్థించినట్లు మహిళలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం ప్రతినిధులు అంచూరి కమల, దాంశెట్టి శ్రావ్య, దొడ ఉమా, మాధవి, అలివేలు, గీత, సుమ, స్వాతి, ధనమ్మ, వాణి, సరోజన, భాగ్య, విజయ, రమ, నాగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# టిజి ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీను జన్మదిన వేడుకలు

ప్రజాపక్షం/కమలాపూర్ : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్ జన్మదిన వేడుకలను కమలాపూర్ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కమలాపూర్ మండల అధ్యక్షులు మౌటం సంపత్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉద్యమకారులను విస్మరించకుండా ప్రభుత్వ పెద్దలతో అనేకసార్లు చర్చోపచర్చలు, ఉద్యమాలు చేసి ఉద్యమకారుల గురించి ఆలోచించే విధంగా చేసి కేకే కమిటి ఏర్పాటులో క్రియాశీల పాత్ర పోషించినటువంటి డాక్టర్ సీమ సీనన్న జన్మదినం సందర్భంగా అతనికి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ ఉద్యమకారుల హక్కుల సాధన పూర్తయ్యేంతవరకు మీ పోరాటాన్ని ఎక్కడ వెనుతిరగకుండా కొనసాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షులు



మౌటం సంపత్, టియుఎఫ్ నాయకులు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తుమ్మ శోభన్ బాబు, ధర్మముల సదానందం, కత్తి రమేష్, పాక కుమారస్వామి, గుండ శ్రీనివాస్, జెట్టి రమేష్, వల్లంపట్ల నర్సయ్య, గూడూరు ప్రసాద్, పుల్ల గోపి, బైరి రాజేష్, పచ్చిమట్ల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.